ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
విశాఖపట్నం
జిల్లా వార్తలు
సోమవారం 27 జనవరి 2025





ప్రసంగిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

ప్రగతి పథంలో విశాఖ

అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా ప్రభుత్వ పాలన

- ఆరోగ్యశ్రీ ద్వారా రూ.304 కోట్లతో వైద్యసేవలు
- జిల్లాలో మెగా పేరెంట్, టీచర్ సమావేశాలు విజయవంతం
- చురుగ్గా ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు
- నీటి సరఫరాకు రూ.98.63 కోట్లతో పోలవరం ఎడమకాలువకు టెండర్లు
- బీసీ, ఎస్సీ, మైనార్టీ సంక్షేమానికి పథకాలు
- దీపం-2 కింద 3.55 లక్షల మందికి ఉచిత సిలిండర్లు
- వారి బ్యాంకు ఖాతాల్లో రూ.27.35 కోట్లు జమ
- సూర్యఘర్ ద్వారా రూఫ్‌టాప్ విద్యుత్ ప్లాంట్లకు ఆదరణ
- రూ.16,260 కోట్లతో పరిశ్రమల ఏర్పాటు
- 35 వేల మందికి ఉపాధి అవకాశాలు
- పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదాతో భారీ ప్రాజెక్టులకు మార్గం సుగమం
- రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల్లో 60 శాతం పరిష్కారం
- రూ.200 కోట్లతో తీరం కోత నివారణకు ప్రతిపాదనలు
- 25 అన్నక్యాంటీన్ల ద్వారా పేదలకు రూ.5లకే భోజనం
- ప్రజా సహకారంతోనే ప్లాస్టిక్ రహిత నగరం సాధ్యం



ప్రథమ స్థానంలో నిలిచిన జీవీఎంసీ శకటం

- గణతంత్ర దినోత్సవంలో కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): **అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా జిల్లా ప్రగతిపథంలో పయనిస్తోందని కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ పేర్కొన్నారు. పోలీస్ పరేడ్ మైదానంలో ఆదివారం నిర్వహించిన 76వ గణతంత్ర వేడుకల్లో ఆయన జాతీయ పతాకాన్ని ఎగురవేసి పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి సందేశం ఇచ్చారు.**

స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో మహనుభావులు త్యాగాలు చేసి 200 ఏళ్ల బ్రిటిష్‌పాలనను తరిమికొట్టి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం తీసుకువచ్చారన్నారు. తరువాత డాక్టరు బీఆర్ అంబేడ్కర్ అధ్యక్షతన ఏర్పడిన కమిటీ రూపొందించిన రాజ్యాంగం 1950 జనవరి 26న అమల్లోకి వచ్చిన రోజునే గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో అమలు జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించి శాఖల వారీగా పురోగతిని వివరించారు.

జిల్లాలో 66 అర్బన్, తొమ్మిది గ్రామీణ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, 54 సచివాలయ కేంద్రాల్లో ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. ఎన్‌సీడీ 3.0 సర్వేలో భాగంగా 84,744 ఇళ్లను సందర్శించి 2,71,273 మందికి కేన్సర్, బీపీ, షుగర్ వ్యాధులపై స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించామన్నారు. పీఎం మాతృత్వ వందన యోజనలో భాగంగా ప్రతి స్త్రీ మొదటి కాన్పునకు రూ.ఐదువేలు, రెండో కాన్పులో ఆడబిడ్డ అయితే రూ.ఆరువేలు చొప్పున గత ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 5,558 మందికి రూ.3.34 కోట్లు అందజేశామన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్టు ద్వారా గత ఏడాది జనవరి నుంచి 1,44,290 మందికి వివిధ రకాల శస్త్రచికిత్సలకు రూ.304 కోట్లు ఖర్చుచేశామని, వైద్యసేవల అనంతరం సహాయం కోసం 45,015మందికి రూ.24.44 కోట్లు అందించామన్నారు. ఇప్పటివరకు సీఎస్ఆర్ కింద కేజీహెచ్/ఆంధ్రవైద్యకళాశాలలో రూ.74 కోట్లు ఖర్చుచేశామని, పీజీ హాస్టళ్ల నిర్మాణపనులు పురోగతిలో ఉన్నాయన్నారు. పాఠశాల విద్యలో తల్లిదండ్రులను భాగస్థులను చేయడం కోసం గతనెలలో జిల్లాలో ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో మెగా పేరెంట్, టీచర్ మీటింగ్‌లు



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు





జాతీయ పతాకాన్ని ఎగురవేసి, వందన సమర్పణ చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్. చిత్రంలో జేసీ మయూర్ అశోక్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, డీసీపీ మేరీ ప్రశాంతి ఉన్నారు.

విజయవంతంగా నిర్వహించామని, సుమారు 69,087 మంది తల్లిదండ్రులు హాజరయ్యారన్నారు.

వ్యవసాయానికి సహకారం

జిల్లాలో వ్యవసాయం, ఉద్యానవన శాఖల ద్వారా పంటల దిగుబడికి పలు పథకాలు అమలుచేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. పాడి పశువులు, కోళ్ల పెంపకానికి 101 మినీ గోకులాల్లో షెడ్లు నిర్మించామన్నారు. ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణకు రూ.178.5 కోట్లతో చేపట్టిన పనులు, చేపలుప్పాడ, భీమిలి వద్ద రూ.రెండుకోట్లతో పనులు ... మిగతా 4వ పేజీలో

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

తిరుమలనగర్‌లో 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కార్యక్రమం రేపు

- ఉదయం 11 గంటలకు ప్రారంభం
- ప్రజలు, అధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య వారధి



విశాఖపట్నం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): **ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు మధ్యవారధిగా 'ఆంధ్రజ్యోతి' నిర్వహించతలపెట్టిన 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం ఈనెల 28న విశాఖ నగరంలోని గాజువాక నియోజకవర్గం పరిధి 87వ వార్డు తిరుమలనగర్ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి గాజువాక ఎమ్మెల్యే పల్లాశ్రీనివాసరావు, 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్నాథం, జోన్-5 కమిషనర్ శేషాద్రి, సౌత్ సబ్ డివిజన్ ఏసీపీ టి.త్రినాథ్, దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు, గాజువాక తహసీల్దారు తోట శ్రీవల్లి, ఏపీఐఐసీ అధికారులు హాజరుకానున్నారు. స్థానిక ప్రజలు తమ సమస్యలను నేరుగా వారితో చెప్పుకునే అవకాశాన్ని 'ఆంధ్రజ్యోతి' కల్పిస్తోంది.**



తిరుమలనగర్ కాలనీ

సమస్యలివీ...

తిరుమలనగర్‌ను దశాబ్దాలుగా పట్టిపీడిస్తున్న అనధికార డంపింగ్‌యార్డు తరలింపు, ఆటోనగర్‌లోని పరిశ్రమల నుంచి వచ్చే గెడ్డను తిరుమలనగర్‌లోకి ప్రవేశించకుండా మళ్లించడం, కాలనీకి సమీపంలో ఖాళీగా ఉన్న 4.3 ఎకరాల భూమిలో స్పోర్ట్స్‌కాంప్లెక్స్ నిర్మాణం, వడ్లపూడి జంక్షన్ నుంచి తిరుమలనగర్, గాంధీబొమ్మ జంక్షన్‌వరకు రోడ్డులో సెంటర్‌లైటింగ్ ఏర్పాటుచేయడం వంటి సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి ప్రజలు నేరుగా తీసుకు వెళ్లే అవకాశం ఉంది.

నగరానికి మంత్రి నారా లోకేశ్

- టీడీపీ కార్యాలయంలో రాత్రి బస
- సాక్షిపై పరువు నష్టం కేసులో నేడు కోర్టుకు హాజరు



టీడీపీ కార్యాలయం వద్ద మంత్రి లోకేశ్‌కు సమస్యలు వివరిస్తున్న ఉపాధ్యాయులు

విశాఖపట్నం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, మానవవనరుల అభివృద్ధిశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదివారం రాత్రి నగరానికి చేరుకున్నారు. గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో విశాఖ ఎయిర్‌పోర్టుకు రాత్రి చేరుకున్న లోకేశ్‌కు మంత్రి కొండపల్లిశ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ప్రభుత్వ విప్ గణబాబు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, విష్ణుకుమార్‌రాజు, సుందరపు విజయకుమార్, లోకం మాధవి, విశాఖ పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ, కార్పొరేషన్ ఛైర్మన్లు పీలా గోవింద్, బత్తుల తాతయ్యబాబుతోపాటు నేతలు బుద్దా నాగజగదీష్, మహ్మద్ నజీర్, పెల ప్రసాద్, చింతకాయల విజయ్, గంటా రవితేజ, బీజేపీ నగర అధ్యక్షుడు పరశురామరాజు తదితరులు న్నారు. ఎయిర్‌పోర్టు నుంచి బయటకు వచ్చిన లోకేశ్‌తో మాట్లాడేందుకు పలువురు ప్రయాణికులు ఆసక్తిచూపించారు. ఈ సందర్భంగా ఓ ప్రయాణికురాలు తన పాపను లోకేశ్‌కు ... మిగతా 4వ పేజీలో

కుటుంబ వివరాలపై సమగ్ర సర్వే

- ఇంటికి, యజమానికి కలిపి జియోట్యాగింగ్
- జిల్లాలో 98.4 శాతం ప్రక్రియ పూర్తి
- 100 శాతం బ్యాంకు ఖాతాల ఈకేవైసీ దిశగా చర్యలు
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల వివరాలు సేకరణ
- సమాచారం లేని వ్యక్తుల కోసం అన్వేషణ



జియోట్యాగింగ్ చేస్తున్న సచివాలయ సిబ్బంది

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో నివసిస్తున్న కుటుంబాలకు చెందిన సమస్త సమాచారం సేకరించే పనిలో ప్రభుత్వం పడింది. ఇందులో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి (అద్దెకు ఉన్నా సరే) యజమానికి, ఇంటికి కలిపి జియో ట్యాగింగ్ చేస్తోంది. ఈ ప్రక్రియ జిల్లాలో దాదాపుగా చివరిదశకు చేరుకుంది. ఇంకా ప్రభుత్వ పథకాలతో అనుసంధానంగా ఉన్న బ్యాంకు ఖాతాలను యాక్టివ్ చేయడం, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల వివరాలపై సర్వే చేస్తున్నారు.

జిల్లాలో మొత్తం 7,21,120 కుటుంబాలు ఉన్నాయి. సగటున ప్రతి సచివాలయం పరిధిలో 1,200 నుంచి రెండువేల కుటుంబాలు నివసిస్తున్నాయి. గతంలో ప్రతి వలంటీరుకు గ్రామీణ ప్రాంతంలో 100,నగరంలో 50 కుటుంబాలను మ్యాపింగ్ చేశారు. అప్పట్లో నివాసం ఉంటున్న ఇంటికి మ్యాపింగ్ చేసినప్పటికీ కుటుంబాలను కలిపి జియో ట్యాగింగ్ చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతి కుటుంబాన్ని జియో ట్యాగింగ్ చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సచివాలయ సిబ్బంది ఆ పనిలో నిమగ్నమయ్యారు.

98.4 శాతం ప్రక్రియ పూర్తి

జిల్లాలో 7,21,120 ఇళ్లకు సంబంధించి ఇప్పటివరకు 7,10,121 (98.4శాతం) ఇళ్లకు జియోట్యాగింగ్ చేశారు. దీనివల్ల జనాభా వివరాలు కూడా వెల్లడికానున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే సంక్షేమ పథకాలు పొందే లబ్ధిదారుల వివరాలతో బ్యాంకు ఖాతాలు యాక్టివ్‌లో ఉండాలి. దీనికి సంబంధించి ఈకేవైసీ చేయాలి. గతంలో పథకాల కోసం హడావిడిగా బ్యాంకు ఖాతాలు తెరిచి, ఆధార్‌లో ఉన్న ఫోన్ నంబరుకు అనుసంధానం చేసిన లబ్ధిదారులు తరువాత ఆయా ఫోన్ నంబర్లను మార్చేశారు. దీంతో పథకాలు అమలు చేసే విభాగాలకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇటువంటివి జిల్లాలో 4,00,448 ... మిగతా 4వ పేజీలో

స్వర్ణంతో మెరిసిన జ్యోతి

- ఎలైట్ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్‌లో నగర క్రీడాకారిణి ఘనత
- 60మీ. హర్డిల్స్‌లో సరికొత్త జాతీయ రికార్డు



విశాఖపట్నం, స్పోర్ట్సు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరానికి చెందిన ఒలింపియన్ ఎర్రాజి జ్యోతి మరో అంతర్జాతీయ స్వర్ణ పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఫ్రాన్స్‌లోని నాంటెస్ మెట్రోపోల్‌లో జరిగిన ఎలైట్ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ మీట్ మహిళల 60మీ. హర్డిల్స్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకం సాధించింది. ఈ మీట్ హీట్స్‌లో 60మీ. హర్డిల్స్ రేస్‌ను 08.07 సెకన్లలో పూర్తిచేసి రికార్డు టైమింగ్ నమోదు చేసిన జ్యోతి....ఫైనల్స్‌లో 60.మీ. రేస్‌ను 08.04 సెకెన్లలోనే పూర్తిచేసి సరికొత్త జాతీయ రికార్డును నెలకొల్పింది. దీంతో ఒకే మీట్‌లో రెండు రికార్డులు సాధించిన ఘనతను సొంతం చేసుకున్నది. గత ఏడాది జరిగిన ఒలింపిక్స్‌లో పాల్గొన్న జ్యోతి భారత అత్యంత వేగవంతమైన హర్డలర్‌గా గుర్తింపు పొందింది. వరల్డ్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీకి దక్షిణాఫ్రికాలో ప్రత్యేక శిక్షణ పొందుతూ ఫ్రాన్స్‌లో జరిగిన ఎలైట్ ఇండోర్ అథ్లెటిక్స్ మీట్‌లో స్వర్ణ పతకం సాధించి తన రికార్డును తనే తిరగరాసింది. జ్యోతి ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఇటీవల అర్జున అవార్డును ప్రకటించింది. కాగా త్వరలో డెహ్రాడూన్‌లో జరగనున్న జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతోంది. ఈ పోటీల్లో రాష్ట్రానికి మరో స్వర్ణ పతకం కచ్చితంగా లభిస్తుందని అథ్లెటిక్స్ వర్గాలు, జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, ఎం.నారాయణరావు, ఇతర ప్రతినిధులు చెబుతున్నారు.

శోకిస్తున్న వైశాఖి

- రౌడీ మూకల అడ్డాగా జల ఉద్యానవనం
- అభివృద్ధికి ముందుకు రాని కాంట్రాక్టర్లు
- ప్రత్యామ్నాయం చూడని వీఎంఆర్‌డీఏ

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)



అశోక వనంలో సీతలా... విశాఖలో వైశాఖి జల ఉద్యానవనం వెలవెలబోతోంది. ఒకప్పుడు సందడిగా ఉండే ఈ ప్రాంతం ప్రస్తుతం ఆకతాయిల అడ్డాగా మారిపోయింది. చీకటి పడితే రౌడీమూకలు చేరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకైక పార్కు, ఇదే కావడం గమనార్హం.

నగరం నడిబొడ్డున పోలీస్ కమిషనర్ కార్యాలయాన్ని ఆనుకొని వైశాఖి జల ఉద్యానవనం ఉంది. దీని విస్తీర్ణం. 3.48 ఎకరాలు. ఇది పాతబడిపోవడం, అంతకు ముందు లీజుకు తీసుకున్న కాంట్రాక్టర్ తక్కువ మొత్తం లీజు చెల్లించడం తదితర కారణాలతో నిర్మాణాలన్నీ కూలగొట్టి అధునాతనంగా తీర్చిదిద్దాలని విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) నిర్ణయించింది. అర్బన్ ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్‌గా రూపుదిద్దాలని భావించింది. గేమింగ్ జోన్, యానిమేషన్, అక్వేరియం వంటివి అందులో ఉండేలా ప్రణాళిక రూపొందించారు. నగర ప్రజలు ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటు పడడంతో చుట్టూ డ్రైవ్- ఇన్-ఫుడ్ జోన్ కూడా అందులో పొందుపరిచారు. అతిథులు ఎప్పుడు వచ్చినా 24/7 ఆహారం లభించేలా ఏర్పాట్లు చేయాలనుకున్నారు.

వీఎంఆర్‌డీఏ ఏ ప్రాజెక్టును అయినా ప్రైవేటు, పబ్లిక్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో చేయాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేయడంతో 33 ఏళ్లకు స్థలాన్ని లీజుకు ఇస్తామని, డెవలపర్లు ముందుకు రావాలని 2023 ద్వితీయార్థంలో టెండర్లను ఆహ్వానించింది. అయితే దీనిపై ఏ ఒక్కరూ ఆసక్తి చూపలేదు.

నిబంధనలే కారణమా..?

భూమిని లీజుకు తీసుకొని, ప్రాజెక్ట్ చేపట్టేవారు ఆ భూమి సబ్ రిజిస్ట్రార్ (ఎస్ఆర్) విలువలో ఒక శాతం ప్రతి నెల అద్దెగా చెల్లించాలన్నది వీఎంఆర్‌డీఏ నిబంధన. అక్కడ 3.48 ఎకరాల భూమి అంటే 16,843 గజాలు. ఆ ఏరియాలో అప్పటికి ఎస్.ఆర్. విలువ గజం రూ.50వేలు ఉంది. ఆ లెక్కన భూమి విలువ సుమారుగా రూ.84 కోట్లు. అందులో ఒక శాతం అంటే రూ.84.21 లక్షలు. దీనికి జీఎస్టీ కూడా ... మిగతా 4వ పేజీలో


భీమిలి జోనల్ కార్యాలయంలో వేడుకలు


ఆర్డీవో కార్యాలయంలో జెండా వందనంలో పాల్గొన్న ఆర్‌డీఓ మాధూర్


పద్మనాభంలో పతాకావిష్కరణ చేస్తున్న ఎంపీడీఓ విజయకుమార్

ఘనంగా గణతంత్ర వేడుకలు

- నియోజకవర్గంలో వాడవాడలా నిర్వహణ
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అధికారులు
- సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించిన విద్యార్థులు


భీమిలి డైట్ కళాశాలలో వేడుకలు

భీమునిపట్నం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ గణతంత్ర దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.భీమిలి పట్టణంలోని జోనల్ కార్యాలయం వద్ద జడ్సీ పి. ప్రేమ ప్రసన్న వాణి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. తొలుత ఆమె కార్యాలయం ఆవరణలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్‌డీఓ కె. సంగీత్ మాధూర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం ఏవో మనో రంజని, తహసీల్దార్ పైలా రామారావు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ఎన్. హనుమంతరావు జాతీయ జెండాను ఆవిష్కరించగా, ఎంపీపీ దంతులూరి వాసురాజు, ఎంఈవో ఎం. శివరాణి, తదితరులు పాల్గొన్నారు. డైట్ కళాశాల వద్ద ప్రిన్సిపాల్ ఎం. జ్యోతికుమారి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సబ్ రిజిస్ట్రార్ హర్ష వర్ధన్, సబ్ ట్రెజరీలో ఎస్‌టీవో అప్పలరాజు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుల కార్యాలయం వద్ద ఏడీ దుర్గా ప్రసాద్, సీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసరు డాక్టర్ ఫణికుమార్, భీమిలి పోలీస్ స్టేషన్‌లో సీఐ సుధాకర్ జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే కేజీబీవీలో ప్రిన్సిపాల్ గంగాకుమారి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రామ ప్రసాద్, డిగ్రీ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి, ది సన్ స్కూల్‌లో స్కూల్ ప్రెసిడెంట్ లక్ష్మీ లావణ్య, సీడర్ స్కూల్‌లో ఐటీబీపీ బెటాలియన్ డెప్యూటీ కమాండెంట్ రమేశ్ సేనాపతి జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. ది సన్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు అవసరాల శ్రీనివాసరావు, కె. శ్రీనివాసరావు పాల్గొన్నారు. డైట్ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

మధురవాడ : మధురవాడలోని అన్ని ప్రాంతాల్లోనూ గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఏడో వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ సునీల్‌శర్మ కాలనీలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గీతాదేవి, టీడీపీ నాయకుడు పిళ్లా వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.విద్యుత్ సబ్‌స్టేషన్, సాంఘిక సంక్షేమ వసతి గృహం వద్ద కూడా వేడుకలు జరిగాయి. పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు, గౌరవాధ్యక్షుడు నాయుడు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

జనసేన కార్యాలయంలో..

ఎండాడ : ఎండాడలో ఉన్న భీమిలి నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో వార్డు అధ్యక్షుడు శాఖరీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో జన సైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు. ఎండాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వానపల్లి శైలజ, పీఎంపాలెం పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐలు భాస్కరరావు, సునీత జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

సింహాచలం : సింహాచలం దేవస్థానం ఈఓ కార్యాలయంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈఓ వేంద్ర త్రినాథరావు తొలుత జాతి పిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పుష్పాలు వేసి, అంజలి ఘటించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవస్థానం సంస్కృత హైస్కూల్, వేద పాఠశాల విద్యార్థులు దేశభక్తి గీతాలపనలు, నృత్యాలు ప్రదర్శించారు. అలాగే అడివివరం సహకార పరపతి సంఘం కార్యాలయంలో పాలక మండలి అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేశ్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలో 76వ గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ ఎం. విజయకుమార్, తహసీల్దారు కార్యాలయం వద్ద తహసీల్దారు కె. ఆనందరావు, పోలీసు స్టేషన్ వద్ద సీఐ శ్రీధర్, విద్యుత్ కార్యాలయం వద్ద ఇన్‌ఛార్జి ఏఈ వెంకటేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. తహసీల్దారు ఆనందరావు రెవెన్యూ ఉద్యోగుల్లో ఉత్తమ సేవలు అందించిన 8 మందికి మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె. రాంబాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దామోదరరావు, డీటీ చంద్రశేఖర్, ఆర్ఐ శ్యామల పాల్గొన్నారు. గ్రామ సచివాలయాలు, జెడ్పీ, ఎంపీపీ పాఠశాలల్లో కూడా వేడుకలు జరిగాయి.

పద్మనాభం రూరల్ : మద్ది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పి. శాంతి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుగత సన్యాసమ్మ,సత్యనారాయణ, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కాళ్ల నగేశ్‌కుమార్, నీటి సంఘం అధ్యక్షుడు గిరి, ఎం. సన్నిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం సచివాలయంలో రాష్ట్ర సర్పంచుల సంఘం కార్యదర్శి గొర్రెపాటి వెంకటలక్ష్మి, భీమిలీ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి పెద ఎర్నినాయుడు జాతీయ జెండాను ఎగురవేశారు.

సాగర్‌నగర్ : జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ సచివాలయం వద్ద కార్పొరేటర్ లొడగల అప్పారావు, వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బి. దొరబాబు, సాగర్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి. శ్రీరామవర్మ, సారిపల్లి శ్రీనివాసరావు, బొడ్డు శ్రీనివాసరావు, ఒమ్మి బాబూరావు పాల్గొన్నారు.రుషికొండ స్వర్ణభారతినగర్ పోలమాంబ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ సర్పంచ్ చెన్నా దాసు, గీతం వర్సిటీలో జీఎంసర్ ప్రో వీసీ డాక్టర్ బి. గీతాంజలి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గీతం విద్యార్థి విభాగం డీన్ ప్రొఫెసర్ కె. బాలా కుమార్, గీతం స్పోర్ట్స్ డైరెక్టర్ డాక్టర్ యు. విజయకుమార్, ఎన్‌సీసీ అధికారులు, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.


లివిన్ అడ్వెంచర్స్ ఆధ్వర్యంలో సముద్ర గర్భంలో వేడుకలు నిర్వహించారు. స్కూబా డైవర్లు 45 నిమిషాల పాటు అండర్ వాటర్‌లో జాతీయ జెండా చేతపట్టుకుని దేశభక్తిని చాటారు.

కొమ్మాది : జీవీఎంసీ ఐదో వార్డు వైఎస్ఆర్ కాలనీలో కార్పొరేటర్ మొల్లి హేమలత జాతీయ జెండాను ఆవిష్కరించారు. పీఎంపాలెం కాలనీలో బీజేపీ ఆధ్వర్యంలోనూ, చంద్రంపాలెం బాపూజీ కళా మందిరం వద్ద గ్రామ పెద్దల ఆధ్వర్యంలోనూ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పిళ్లా సూరిబాబు, పిళ్లా కృష్ణమూర్తి పాత్రుడు, నాగోతి తాతారావు పాల్గొన్నారు.

ఆనందపురం : జాతీయ భావం కలిగిన యువత నిర్మాణమే ఆర్ఎస్ఎస్ ముఖ్య ఉద్దేశమని అఖిల భారత విద్యా భారతి విద్యాలయాల అధ్యక్షుడు దూసి రామకృష్ణారావు అన్నారు. ఆర్ఎస్ఎస్ ఆనందపురం శాఖ ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సేవకులు ఆనందపురం కూడలి వేములవలస ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు బాలి రవి, తమ్మిన నరసింగరావు, దుక్క అప్పలరాజు, బి. శంకర్, కేశవ నాయుడు ,సతీశ్, తదితరులు పాల్గొన్నారు.


సింహాచలం : జెండా వందనం చేస్తున్న అడవివరం సహకార పరపతి సంఘం అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి


గీతం వర్సిటీలో జరిగిన వేడుకల్లో సెల్యూట్ చేస్తున్న ఆచార్యులు


వేములవలసలో ఆర్ఎస్ఎస్ సేవకుల ర్యాలీ

చికిత్స పొందుతూ మరో బాలిక మృతి


ఇషిత (ఫైల్‌ఫొటో)

తగరపువలస, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : దంపతుల మధ్య తలెత్తిన మనస్పర్థల కారణంగా క్షణికావేశంలో ఇద్దరు బిడ్డలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటనలో చికిత్స పొందుతున్న మరో బాలిక కూడా మృతి చెందింది. భీమిలి మండలం చిట్టివలసలోని ఆదర్శనగర్ కాలనీ గొల్లవీధిలో నివాసం ఉంటున్న మహంతి మాధవి (25) శుక్రవారం సాయంత్రం తన ఇద్దరు కుమార్తెలు ఇషిత (5 సంవత్సరాలు),రితిక్ష (18 నెలలు)తో కలిసి పురుగుల మందు తాగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో శుక్రవారం అర్ధరాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మాధవి మృతి చెందగా, శనివారం తెల్లవారుజామున చిన్న కుమార్తె రితిక్ష ప్రాణాలు విడిచింది. పెద్ద కుమార్తె ఇషిత నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున కన్నుమూసింది. మాధవి భర్త రామకృష్ణ ఫోన్‌కు వేరే యువతి నంబరు నుంచి వస్తున్న మెసేజ్‌ల కారణంగా ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం భర్త దివీస్ కంపెనీలో విధులకు వెళ్లిపోగా మాధవి, తన ఇద్దరు పిల్లలకు ఆహారంలో పురుగుల మందు కలిపి తనతో పాటు పిల్లలకు పెట్టింది. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం వల్ల ఆమెతో పాటు ఇద్దరు పిల్లలు మృతి చెందారు.ఈ ఘటనతో గొల్లవీధిలో విషాదం నెలకొంది. ఎంతో సరదాగా వుండే కుటుంబంలో ఘోరం జరిగిపోయిందంటూ స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. భార్య పిల్లలను కోల్పోయిన భర్త దిగాలు పడిపోయారు. ఈ విషయమై భీమిలి సీఐ సుధాకర్ మాట్లాడుతూ ఇషిత మృతదేహానికి భీమిలి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రగతి పథంలో విశాఖి

... 3వ పేజీ తరువాయి

కొనసాగుతున్నాయన్నారు. ఉపాధి హామీ పథకం నుంచి రూ.16.55 కోట్లతో 11.64 కి.మీ సిమెంట్ రోడ్లు, రూ.2.9 కోట్లతో ఏడు కి.మీ. తారు రోడ్లు, రూ.3.22 కోట్లతో 173 గోకులాలకు షెడ్ల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయన్నారు. నగరానికి తాగునీరు, పరిశ్రమల అవసరాలకు కోసం గోదావరి నుంచి 23.44 టీఎంసీలు సరఫరాకు రూ.98.73 కోట్లతో పోలవరం ఎడమ ప్రధాన కాలువ ఎనిమిదో ప్యాకేజీకి పిలిచిన టెండర్లు ఖరారుదశలో ఉన్నాయన్నారు.

మహిళా సంఘాలకు చేయూత

జిల్లాలో 15,098 స్వయంశక్తి సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.866 కోట్ల రుణాలు, స్త్రీనిధి ద్వారా 5,286 సభ్యులకు రూ.26.44 కోట్ల రుణాలు అందజేశామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా 18 వసతిగృహాల్లో మెరుగైన వసతుల కల్పనకు రూ.203 లక్షలు విడుదల చేశామన్నారు. బీసీ వెల్ఫేర్ ద్వారా 38,017 మంది బీసీ/ఈబీసీ/కాపు విద్యార్థులకు రూ.30 కోట్ల పోస్టు మెట్రిక్. 38,109 మంది విద్యార్థులకు రూ.35.72 కోట్లు మంజూరుచేశామన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం రూ.54.44 కోట్ల రుణాలను 2313 యూనిట్లకు అందజేశామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఐదు తాగునీటి పథకాలు, 80 చిన్న పథకాలు, పారిశుధ్యానికి రూ.40 కోట్లు మంజూరుచేశామన్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ. 17.53 కోట్లతో 28 కి.మీ. 139 సీసీ రోడ్లు మంజూరుకాగా ఇంతవరకు 96 పనులు పూర్తి కాగా మిగిలినవి పురోగతిలో ఉన్నాయన్నారు. సెంటు స్థలంలో 1.39 లక్షల ఇళ్లకుగాను ఇంతవరకు 28,423నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. దీపం-2 పథకంలో పేదలకు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల పంపిణీలో భాగంగా తొలివిడతగా 3,55,114 మందికి రూ.27.35 కోట్లు సబ్సిడీ బ్యాంకు ఖాతాలకు జమచేశామన్నారు.

సోలార్ విద్యుత్‌కు ఆదరణ

పీఎం సూర్యఘర్ బిజిలీ యోజన పథకం కింద ఇంటి పైకప్పులపై సోలార్ పలకల ఏర్పాటునకు జిల్లాలో ఐదువేల మంది దరఖాస్తు చేయగా ఇప్పటివరకు 800 ఇళ్లకు పలకలు అమర్చి గ్రిడ్‌కు అనుసంధానంచేశామని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో రూ.16,219 కోట్లతో నాలుగు భారీ, రూ.43.4 కోట్లతో 35 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు త్వరలో ఉత్పత్తులు ప్రారంభించనున్నాయని, దీంతో 35వేల మందికి ఉపాధి లభించనున్నదన్నారు. పర్యాటకశాఖకు పరిశ్రమల హోదా కల్పించడంతో జిల్లాకు భారీగా ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉందన్నారు. రుషికొండలో కొత్తగా ఐదు బోట్లు, ఫిషింగ్‌హార్బర్‌లో ప్రస్తుతం ఉన్న బోటింగ్ యూనిట్‌కు 50 సీట్ల సామర్థ్యం వరకు పెంచుతూ ప్రతిపాదనలు మంజూరుచేశామన్నారు. భూములకు సంబంధించి సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 7,098 అర్జీలు రాగా 60 శాతం పరిష్కరించామన్నారు. బీచ్‌రోడ్డులోవీఎంఆర్‌డీఏ చేపట్టిన హెలికాప్టర్ మ్యూజియం త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. కాకానినగర్ వద్ద వాహన రద్దీని పరిగణనలో తీసుకుని రూ.25 కోట్లతో అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదించామన్నారు. వీఎంఆర్‌డీఏ, సీఎస్ఆర్, పీపీపీ విధానంలో రూ.180 కోట్లతో 36 కి.మీ.పొడవైన రోడ్ల నిర్మాణాలకు అనుమతులు తీసుకున్నామని, కైలాసగిరిపై సాహసక్రీడలు, గ్లాస్‌స్కై వాకింగ్ బ్రిడ్జి త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి వరకు తీరం కోత నివారణకు రూ.200 కోట్లతో ప్రతిపాదించామన్నారు.

ఏడాదికి రూ.3.33 కోట్లతో 25 అన్నక్యాంటీన్లను నిర్వహిస్తున్నామన్నారు. నగరంలో జనవరి ఒకటోతేదీ నుంచి ప్లాస్టిక్ నిషేధం అమల్లోకి వచ్చిందని, ప్రజలు సహకరించాలని కోరారు. సుమారు రూ.400 కోట్లతో రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలు, స్టేడియాలు మరమ్మతుల్లో కొన్ని పూర్తికాగా మరికొన్ని పురోగతిలో ఉన్నాయన్నారు. మధురవాడ, ముడసర్లోవలో రూ.595 కోట్లతో వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్, రూ.563 కోట్లతో మధురవాడలో డ్రైనేజీ నెట్‌వర్క్, పీపీపీ విధానంలో 15 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌కు ప్రతిపాదించామన్నారు. నగరంలో యూజీడీ వ్యవస్థ మెరుగుపర్చడానికి రూ.297 కోట్లతో చేపట్టిన రెండు ప్రాజెక్టులు ప్రారంభదశలోనే ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. తొమ్మిది ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన 446 మంది ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. చివరగా వస్తువుల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, డీసీపీ మేరీ ప్రశాంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కుటుంబ వివరాలపై సమగ్ర సర్వే

... 3వ పేజీ తరువాయి

ఖాతాలున్నాయని గుర్తించి, ఇప్పటివరకు 3,98,403 (99.49 శాతం) బ్యాంకు ఖాతాలకు ఈకేవైసీ పూర్తిచేశారు.

ఎంఎస్ఎంఈలపై ఆరా!

ఉపాధి కోసం పలు రకాల పరిశ్రమలు స్థాపించిన కుటుంబాల స్థితిగతులపైనా సమగ్ర సర్వే చేస్తున్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాలో ఇటువంటి పరిశ్రమలు 1,14,482 ఉండగా ఇంతవరకు 25,980 (22.6 శాతం) సర్వే చేశారు. ఆయా పరిశ్రమలపై ఆధారపడే కుటుంబాలు, ఉత్పత్తులు, స్థానికంగా విక్రయిస్తున్నారా లేక ఎగుమతి చేస్తున్నారా?, లభిస్తున్న ఆదాయం తదితర వివరాలు పొందుపరుస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంఎస్ఎంఈ యూనిట్లను ప్రోత్సహిస్తుండడం, సబ్సిడీలు, ఎగుమతులకు అనుకూలంగా విధానాలు రూపొందించడంతో ఎంఎస్ఎంఈ డేటా ఆ రంగాన్ని ప్రోత్సహించేందుకు వీలు కల్పిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

తప్పుల తడకగా నవశకం సర్వే

వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో నవశకం పేరిట హడావుడిగా సర్వే చేసింది. ఇందులో అనేక తప్పులు దొర్లాయి. కొంతమంది తప్పుడు ఆధార్, ఫోన్ నంబర్లు ఇచ్చారు. ఆ వివరాల మేరకు ప్రస్తుతం సర్వే చేయగా ఆయా ఇళ్లల్లో నివసిస్తున్న వారికి, ఆధార్ నంబర్లకు పొంతన కుదరడం లేదు. దీనిని మిస్సింగ్ డేటాగా గుర్తించి, వారి వివరాల కోసం సర్వే చేస్తున్నారు. జిల్లాలో రెండు లక్షల మంది వివరాలు మిస్సింగ్ డేటాలో ఉన్నట్టు గుర్తించిన సిబ్బంది ఇప్పటివరకు 72,873 మంది వివరాలు తెలుసుకున్నారు. మిగిలిన వివరాలను సేకరించే పనిలో ఉన్నామని డీఎల్‌డీవో ఉషారాణి వివరించారు.

నగరానికి మంత్రి నారా లోకేశ్

... 3వ పేజీ తరువాయి

అందజేసి ఆశీర్వదించాలని కోరగా ఆయన నవ్వుతూ తీసుకున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి నగరంలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్న మంత్రికి భీమిలి, విశాఖ తూర్పు ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మంత్రి లోకేశ్‌ను కలిశారు. గత ఏడాది మైదాన ప్రాంతం నుంచి ఎక్కువమందిని ఏజెన్సీకి బదిలీ చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ తమను తిరిగి మైదానానికి బదిలీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కాగా మంత్రి లోకేశ్ సోమవారం సాక్షిపై వేసిన పరువునష్టం కేసు విచారణలో జిల్లా కోర్టుకు హాజరుకానున్నారు.

శోకిస్తున్న వైశాఖి

... 3వ పేజీ తరువాయి

చెల్లించాలి. అది కలిపితే సుమారుగా కోటి రూపాయలు అద్దెగా ఇవ్వాలి. అది కాకుండా అక్కడ జరిగే వ్యాపారంలో కొంత శాతం ఇవ్వాల్సి ఉంటుందని మరో నిబంధన ఉంది. అంటే ఎలా లేదన్నా నెలకు రూ.1.25 కోట్లు చెల్లించాలి. అది లాభదాయకం కాదని, అక్కడ అంత వ్యాపారం జరగదని వ్యాపారులు ఎవరూ ముందుకు రాలేదు. దాంతో వైశాఖి జల ఉద్యానవనం ప్రాజెక్టు ఏడాదిన్నరగా ఆగిపోయింది. దానిని ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై అధికారులు కూడా ఏమీ ఆలోచించడం లేదు. ప్రస్తుతం అది ఖాళీగా ఉండడంతో ఆకతాయిల అడ్డాగా మారిపోయింది.

అధికారులతో చర్చిస్తాం

ఇటీవల నిర్వహించిన ప్రజాదర్బార్‌లో దక్షిణ నియోజకవర్గ కూటమి నాయకులు కలిశారు. ఆ పరిధిలో అది ఒక్కటే వినోద కేంద్రమని, అభివృద్ధి చేయాలని కోరారు. అధికారులతో చర్చించి, ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలో ఆలోచిస్తాం.

- ఎంవీ ప్రణవ్ గోపాల్, చైర్మన్, వీఎంఆర్‌డీఏ

వుడా కాలనీలో మహిళపై దాడి

ఎండాడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : పాన్ షాప్ నిర్వహిస్తున్న మహిళను వ్యక్తి దుర్భాషలాడడంతో పాటు దాడి చేసిన ఘటనపై పీఎంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వెంకాల నాగలక్ష్మి (44) మిథిలాపురి వుడాకాలనీలో నివాసం ఉంటూ పాన్‌షాప్ నిర్వహిస్తుంది. మారిపిల్లి వెన్నల రాజు ఆదివారం దుకాణం వద్దకు వచ్చి వస్తువు కొనుగోలు విషయంలో ఆమెను దుర్భాషలాడడంతో పాటు చేయి చేసుకున్నారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు.

వణికిస్తున్న చలి

పద్మనాభం రూరల్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండల ప్రజలు చలికి గజగజ వణుకుతున్నారు. రోజురోజుకి ఉష్ణోగ్రతలు తగ్గిపోతుండడంతో చలి తీవ్రత అధికమవుతోంది. మంచు కూడా ఎక్కువగా పడుతుండడంతో ఉదయం ఏడు గంటల వరకూ ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. మంచు తీవ్రతకు పట్ట పగలు కూడా వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగిస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి చల్లటి గాలులు వీస్తుండడంతో వృద్ధులు, చిన్నారులు చలికి వణికిపోతున్నారు.

రామవరంలో రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న గంటా రవితేజ

ఆనందపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రసామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రామవరంలో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాలను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తనయుడు రవితేజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వచ్ఛంద సేవలో ముందుండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. శిబిరం ఏర్పాటుకు ముందుకు వచ్చిన ఆర్ఎంపీ వైద్యుడు లోగిన గణేష్‌ను ఆయన అభినందించారు. కాగా శిబిరంలో 250 మందికి వైద్యులు పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. అనంతరం గ్రామానికి చెందిన వంద మంది యువకుల నుంచి విజయ బ్లడ్ బ్యాంక్, అక్షయ ఆస్పత్రి, విజన్ ట్రీ ఐ ఆస్పత్రి సిబ్బంది రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్ర రాజు, తర్లువాడ సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, చందక మాజీ సర్పంచ్ పొంద్రంకి అప్పలరాజు, కోరుకొండ మూర్తి, వైకుంఠ, తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ రోగికి ఆర్థిక సాయం

తగరపువలస, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్ రోగి శ్రీవిద్యకు గంటా శారదమ్మ అండగా నిలిచారు. రాజమహేంద్రవరంలోని జండా పంజారోడ్‌కు చెందిన శ్రీవిద్య ఓవరియాన్ కేన్సర్‌తో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఒక టివి ఛానల్‌లో ప్రసారం కావడంతో శారదమ్మ చూసి చలించారు. రోగి వివరాలు తెలుసుకుని రాజమండ్రి జీఎస్ఎల్ ఆస్పత్రి వైద్యులతో మాట్లాడారు. ఆమెను విశాఖ రప్పించి తన ఇంట్లో మూడు రోజులు ఆశ్రయం కల్పించి, పెట్ స్కానింగ్ చేయించి ఆదుకున్నారు. అలాగే రూ. 5 వేలు అందజేశారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న స్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా స్వర్ణ పుష్పార్చన ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి సిరి సంపెంగలను తీసుకువచ్చి బేడా మండప ప్రదక్షిణ చేశారు. అనంతరం భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన,పుణ్యాహవచనములు చేసి షోడశోపచరాలు సమర్పించారు. తరువాత నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున సిరి సంపెంగలతో పూజలు చేశారు. మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

కారు ఢీకొని విద్యార్థికి తీవ్ర గాయాలు

సాగర్‌నగర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : బీచ్ రోడ్డు అంధ బాలికల ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న మలుపులో కారు ఢీకొనడంతో ఇంజనీరింగ్ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఆరిలోవ ఎస్ఐ రామదాసు తెలిపిన వివరాలు ప్రకారం.. పెందుర్తి దరి అక్కిరెడ్డిపాలెంకు చెందిన అక్కిరెడ్డి విష్ణువర్ధన్ (21) ఆదివారం సెలవు కావడంతో బైక్‌పై రుషికొండ వైపు విహారానికి వచ్చాడు. ఈమేరకు అంధ బాలికల ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న మలుపులో అదే మార్గంలో ప్రయాణిస్తున్న కారు ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్ర గాయాల పాలైన యువకుడ్ని స్థానికులు ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. సిసి కెమెరాల ఆధారంగా కారును గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామదాసు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'కార్యకర్తలకు అండగా ఉంటా'

సాగర్‌నగర్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) :కార్యకర్తల్లో ఆత్మ స్థైర్యం పెంచడానికే మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తనను భీమిలి నియోజకవర్గం సమన్వయకర్తగా నియమించారని పార్టీ నాయకుడు మజ్జి చిన్న శ్రీను అన్నారు. ఆదివారం రుషికొండలో మాజీ సర్పంచ్ చెన్నాదాసు ఆధ్వర్యంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కార్యకర్తల్లో నైతిక స్థైర్యం నింపాల్సిన బాధ్యతను జగన్ తనపై పెట్టారన్నారు. నియోజకవర్గం ప్రజలకు జగన్‌పై అభిమానం ఏమాత్రం తగ్గలేదన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఎంపీపీ వాసురాజు, నాయకులు పెదబాబు, తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ రామాయణంపై చాగంటి ప్రవచనాలు


శ్రీరామ యంత్రాన్ని వేదికపై ఏర్పాటు చేస్తున్న చాగంటి, హారతి ఇస్తున్న అర్చకులు

కొమ్మాది, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : కొమ్మాది గాయత్రి ఇంజనీరింగ్ మహిళా కళాశాల ఆవరణలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన శ్రీరామ జననం గురించి వివరించారు. శ్రీరాముడి జననంపై వివరించే సమయంలో త్రేతా యుగంలో అయోధ్య నగరంలో జరిగిన విధంగా మంగళధ్వనుల మధ్య శ్రీరాముడిపై పుష్పార్చన కురిపించి ప్రత్యేక మంగళనీరాజనాలు సమర్పించారు. అంతకముందు కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి కాంచీపురం నుంచి ప్రత్యేకంగా పంపించిన శ్రీరామ యంత్రాన్ని మేళతాళాలతో, పండితుల వేదమంత్రోచ్చారణల మధ్య ప్రవచనాల వేదికపై అలంకరించి, మంగళహారతులు అందించారు. ఈ కార్యక్రమంలో అష్టలక్ష్మీ దేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

రేవిడిలో క్రీడా పోటీలు

పద్మనాభం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేవిడి గ్రామంలో కేంద్ర యువజన మంత్రిత్వ శాఖ పరిధిలోని నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బ్లాక్ స్థాయి క్లస్టర్ క్రీడా పోటీలు ఆదివారం నిర్వహించారు. యువతకు వాలీబాల్, కబడ్డీ, ఇతర పోటీలు నిర్వహించారు. విజేతలకు నెహ్రూ యువ కేంద్రం తరఫున సర్టిఫికెట్లు, పతకాలు అందజేస్తామని ప్రతినిధి మధు తెలిపారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ డ్రైవింగ్ విభాగంలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పొందేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులకు 21 ఏళ్ల వయసు ఉండాలన్నారు.

వాడవాడలా గణతంత్ర సంబరాలు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మువ్వన్నల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, విద్యాలయాలు, రాజకీయ పార్టీల కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం సిద్ధించిన రోజును తలచుకొని ఉప్పొంగిపోయారు. ఉదయం నుంచి పతాకావిష్కరణలతో ఆయా ప్రాంతాల్లో సందడి నెలకొంది.


ఎంవీపీ కాలనీ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటర్ మంగవేణి


సిరిపురం : జెండాను ఎగురవేస్తున్న ఎస్బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్‌కుమార్


ఆరిలోవ : సీఐడీ కార్యాలయం వద్ద జెండాకు అభివాదం చేస్తున్న ఏఎస్పీ డాక్టర్ ప్రేమకాజల్

ఎంవీపీ కాలనీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని సెవెన్త్ డే అడ్వంటిస్ట్ స్కూలు, ఏఎస్ రాజా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జీవీఎంసీ 18వ వార్డులోని ఎంవీపీ సర్కిల్ వద్ద కార్పొరేటర్ గొలగాని మంగవేణి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వెలగపూడి జెండా ఎగురవేశారు. గిరిజన్ భవన్, డీఆర్డీఏ, ఎంవీపీ పోలీస్ స్టేషన్, హౌసింగ్ కార్పొరేషన్, పలు ప్రైవేటు విద్యా సంస్థల్లో ఆయా కార్యాలయాలు, సంస్థల అధిపతులు పతాకావిష్కరణ చేశారు. విశాఖపట్నం పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో ఆరో సెక్టర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఏబీసీ పార్కులో వేడుకలు నిర్వహించారు. అలాగే ప్రభుత్వ మత్స్యకార పాఠశాలలో జరిగిన వేడుకల్లో లైన్స్ క్లబ్ ద్వారకానగర్ అధ్యక్షుడు జీబీ కుమార్ పాల్గొన్నారు.

పెదవాల్తేర్‌లో..

పెదవాల్తేరు : జీవీఎంసీ 21వ వార్డు చినవాల్తేరులోని లిల్లీ వైట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఓమ్మి అనిల్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి.వేణు, గోపాలరావు, డి.నాగేశ్వరరావు, శేఖర్‌పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ : దీనదయాళ్‌పురంలో గల ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో నిర్వహించిన వేడుకల్లో సూపరింటెండెంట్ వీరయ్య, విమ్స్‌లో డైరెక్టర్ కె.రాంబాబు, పెదగదిలిలోని మండల ప్రాథమిక పాఠశాలలో బి.గోవింద, చినగదిలిలోని మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కిరణ్‌పాల్, ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలలో జూ క్యూరేటర్ జి.మంగమ్మ, జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో జేడీ రామకృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే కేంద్ర కారాగారంలో సూపరింటెండెంట్ మహేశ్‌బాబు, సీఐడీ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ డాక్టర్ జి.ప్రేమకాజల్ జాతీయ జెండాలను ఎగుర వేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో..

మద్దిలపాలెం : మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ విజయబాబు జాతీయ జెండా ఆవిష్కరించి గౌరవవందనం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.సుజాత జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్స్ పిరమిడ్స్ విన్యాసాలు చేశారు. బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం : జీవీఎంసీ 15వ వార్డులోని పాత వెంకోజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం సీహెచ్ జ్యోతి జాతీయ జెండా ఎగురవేశారు. జేఆర్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్. కెఎస్‌ఆర్ మూర్తి, గ్రామస్థులు పాల్గొన్నారు. వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. జేఆర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ బుద్ధ విగ్రహం వద్ద జెండా వందనం చేపట్టారు. అలాగే 16వ వార్డులోని ఇసుకతోట అంబేడ్కర్ కాలనీలో ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ మొల్లి అప్పారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పాత వెంకోజీపాలెంలోని శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో రామాలయం వద్ద జెండా వందన కార్యక్రమం జరిగింది.

సిరిపురంలో..

సిరిపురం : రాజ్యాంగ ముసాయిదా కమిటీ రూపొందించిన భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలలోకి వచ్చిందని భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్‌కుమార్ పేర్కొన్నారు. సిరిపురం ఎస్‌బీఐ ప్రధాన అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయ ఆవరణలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక ఆర్‌ఎంలు, ఏజీఎంలు, ఆఫీస్ బేరర్స్, యూనియన్ అండ్ ఎస్‌ఈడబ్ల్యుఏ, ఏఓ, ఆర్‌బీఓ, స్టాఫ్,పెన్షనర్స్ పాల్గొన్నారు.

రామ్‌నగర్‌లో..

రామ్‌నగర్ : నెహ్రూనగర్ రెసిడెన్షియల్ అసోషియేషన్ ఆధ్వర్యం లో టీడీపీ 28వ వార్డు ఇన్‌చార్జి నక్కా కనకరాజు వేడుకలు నిర్వహించారు. పారిశ్రామికవేత్త భరిణికాన రామారావు పతాకావిష్కరణ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు భూసర విఘ్నేశ్వరరావు, కార్యదర్శి అక్కరమాని సతీష్ తదితరులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.


వెంకోజీపాలెం : పాత వెంకోజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో వేడుకలు


రామ్‌నగర్ : నెహ్రూనగర్‌లో జెండా ఎగుర వేస్తున్న స్థానికులు


మద్దిలపాలెం : కృష్ణా జూనియర్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్ల విన్యాసాలు

జీవీఎంసీలో పతాకావిష్కరణ


పతాకావిష్కరణలో పాల్గొన్న ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిరప్రసాద్, మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ అధికారులు

వెంకోజీపాలెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రజలకు గణతంత్ర దినోత్సవ ఫలాలు అందాలని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన 76వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నగర మేయరు గొలగాని హరి వెంకటకుమారితో కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర సాధనకు కృషి చేసిన ఎందరో మహానుభావులకు వందనాలను తెలియజేశారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశాంసా పత్రాలను అందజేశారు.

వీఎంఆర్డీఏలో..

సిరిపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మనకు స్వాతంత్ర్యం ఎందరో మహానుభావులు తమ ప్రాణ త్యాగాల ఫలితమేనని వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. ఆదివారం సిరిపురం వీఎంఆర్డీఏ కార్యాలయ ఆవరణలో 76వ గణతంత్ర వేడుకలను నిర్వహించారు. జాతీయ పతాకాన్ని కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనమంతా మన బాధ్యతను గుర్తించి కష్టపడి పనిచేస్తే విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దోహదపడాలని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, చీఫ్ ఇంజనీర్ భవానీ శంకర్, ఇంజనీర్ బలరామరాజు, సుజాత శివానీ, దయానిధి, హరిప్రసాద్, శిల్పా తదితరులు పాల్గొన్నారు.


పతాకావిష్కరణ చేస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

ఘనంగా పంచాయతన హోమాలు

ఎంవీపీ కాలనీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీసరస్వతీ సహిత పంచాయతన యాగ మహోత్సవం రెండో రోజైన ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీశారదా విద్యానికేతన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం విశ్వక్సేన ఆరాధన, హయగ్రీవ మాలామంత్ర హవనం, వేంకటేశ్వరస్వామి కల్యాణం, ఊంజల్ సేవ, సప్తవాద్య తరంగిణి, స్వరార్చన, భగవన్నామ సంకీర్తన నిర్వహించారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు విఘ్నేశ్వర పూజతో మొదలైంది. విద్యార్థులు ఆలపించిన భక్తిగీతాలు, పలు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీ నరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం),కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 14, వంకాయలు (తెలుపు)24, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 52, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 46, బీరకాయలు 52, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 16, క్యారెట్ 28 దొండకాయలు 44, బంగాళ దుంపలు 25, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)46, బరబాటి 42, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 24, దోస కాయలు 32, వె ల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, పొటల్స్ 80, కీరదోస 34, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 40, కంద 56, దేముడు చిక్కుడు 38, గోరు చిక్కుడు 30, ఆగాకార దేశవాళి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 26, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 150, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

డ్రోన్‌తో జాతీయ జెండా

విశాఖపట్నం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం నగరానికి చెందిన వైజాగ్ ఎరోల్యాట్ టీమ్ ఆర్కే బీచ్‌లో డ్రోన్ సాయంతో జాతీయ పతాకాన్ని గాలిలోనికి ఎగురవేశారు. ఒకేసారి రెండు డ్రోన్‌ల సాయంతో ఎగురవేసిన జాతీయపతాకాలు ఆకాశంలో కనువిందుచేశాయి. ఈ సమయంలో అక్కడే ఉన్న వైజాగ్ వెదర్‌మ్యాన్ సాయికిరణ్ తన సెల్ ద్వారా చిత్రీకరించి ఎక్స్‌లో పోస్టుచేశారు. గణతంత్ర దినోత్సవం కావడంతో బీచ్‌కు పెద్ద సంఖ్యలో వచ్చిన సందర్శకుడు డ్రోన్లతో జాతీయ పతాకం ఎగురవేయడాన్ని ఆసక్తిగా తిలకించారు.


బీచ్‌లో డ్రోన్ సాయంతో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన దృశ్యం

బీజేపీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం


పతాకాన్ని ఎగుర వేస్తున్న పరశురామ్‌రాజు

పెదవాల్తేరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగం ఆమోదించిన స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సార్వభౌమాధికారం అంది వచ్చిన రోజే గణతంత్ర దినోత్సవమని ఉత్తర నియోజకవర్గఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం నగర బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలను నిర్వహించి జాతీయపతాకాన్నిఆవిష్కరించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీఎన్ మాధవ్, సీనియర్ నేతలు సురేంద్ర మోహన్, నాగేంద్ర, సుహాసినీఆనంద్, దిలీప్ కుమార్, బీజేపీ జిల్లా, మండల, వార్డు అధ్యక్షులు, నాయకులు, కర్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో..

మద్దిలపాలెం : మద్దిలపాలెంలోని వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్ బంగ్లాలో హైటీ వేడుకలు


హై టీ పార్టీలో కలెక్టర్ హరేంధిరప్రసాద్, డాక్టర్ సూర్యారావు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు

సిరిపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ బంగ్లాలో హైటీ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో 'పద్మశ్రీ' అవార్డు గ్రహీత, ప్రముఖ వైద్యుడు కూటికుప్పల సూర్యారావు, రాజకీయ ప్రముఖులు, నేవీ, పోలీస్, జిల్లా అధికారులు భాగస్వామ్యమయ్యారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దేశభక్తి గీతాలతో గేయాలతో నృత్యాలతో చిన్నారులు జిల్లా అధికారులను అలరించారు.చివరగా కలెక్టర్ హరేంధిరప్రసాద్, డా.కూటికుప్పల సూర్యారావుతో కలిసి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ వరదు కల్యాణి, జెడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్, ఎన్టీఆర్ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర్, జాయింట్ కలెక్టర్ మయూర్ ఆశోక్, జీసీసీ ఎండీ కల్పనాకుమారి, డీసీపీ 1 అజిత, డీసీపీ 2 మేరీ ప్రశాంతి, డీఆర్వో భవానీశంకర్, విశాఖ, భీమిలి ఆర్డీవోలు, అధికారులు పాల్గొన్నారు.

ఏయూలో మువ్వెన్నల రెపరెపలు

వెంకోజీపాలెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూ బాస్కెట్ బాల్ మైదానంలో నిర్వహించిన వేడుకల్లో వీసీ జి.శశిభూషణరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఆలోచన విధానాలలో దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపే బాధ్యత యువతపైనే ఉందన్నారు. అంతకుముందు ఏయూ పరిపాలన భవనం వద్దనున్న మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు, అంబేద్కర్ లా కళాశాల ప్రాంగణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఏయూ వీసీ, రెక్టార్ ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏయూ బాస్కెట్ బాల్ మైదానంలో నిర్వహించిన వేడుకలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఏయూ సెక్యూరిటీ, ఏయూ క్రీడా విభాగం గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు ఏయూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సెక్యూరిటీ, ఏయూ క్రీడా విభాగం గౌరవ వందనం స్వీకరిస్తున్న వీసీ శశిభూషణరావు

ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో ఎస్‌ఆర్‌పురం సర్పంచ్


ఎస్‌ఆర్‌పురం సర్పంచ్ దూది విజయలక్ష్మికి మెమెంటో అందజేస్తున్న కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్

పెందుర్తి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):దేశ రాజధానిలో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకలకు మండలంలోని ఎస్‌ఆర్ పురం సర్పంచ్ దూది విజయలక్ష్మి హాజరయ్యారు,ఈ సందర్భంగా ఇండియన్ గేట్ వే పరేడ్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు అంశాలను పంచాయతీలో అమలుచేసి, అభివృద్ధి సాధించినందుకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ చేతుల మీదుగా సర్పంచ్ విజయలక్ష్మి మెమెంటో అందుకున్నారు. గణతంత్ర వేడుకలకు రాష్ట్రవ్యాప్తంగా 25 మంది సర్పంచులు ఎంపికవగా విశాఖ జిల్లా నుంచి ఎస్‌ఆర్‌పురం సర్పంచ్ విజయలక్ష్మికి స్థానం లభించింది.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం



మద్దిలపాలెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : సీబీఎం కాంపౌండ్ టింపనీ స్కూల్ మెయిన్ గేట్ ఆటో స్టాండ్ వద్ద ఆదివాం ఉదయం గుర్తు తెలియని యువకుడు మృతదేహం లభ్యమైంది. సుమారు 30 ఏళ్లుంటాయి. యువకుడు చలనం లేకుండా పడిఉండడంతో స్థానికులు త్రీటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడి మృతదేహన్ని పరిశీలించారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. యువకుడి వివరాలు తెలిసిన వారు మూడోపట్టణ పోలీస్‌స్టేషన్ లేదా 7995095321 నంబర్‌కు తెలియజేయాలని ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు.

బాలకృష్ణకు పద్మభూషణ్‌పై హర్షం


ఎమ్మెల్యే కార్యాలయం వద్ద కేకు కట్ చేస్తున్న వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : సినీ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణకు పద్మభూషణ్ ప్రకటించిన నేపథ్యంలో తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కార్యాలయం వద్ద సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేకు కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోతనరెడ్డి, కాళ్ల శంకర్, గొలగాని పోలరావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల నృత్యాలు



నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) :క్యాప్స్ మూడో వార్షికోత్సవం సందర్భంగా పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ఆల్ ఇండియా నృత్య పోటీలు నిర్వహించారు. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ కేటగిరిల్లో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కూచిపూడి, భరతనాట్యం నృత్యాలతో పోటాపోటీగా ప్రదర్శనలిచ్చారు. సీనియర్స్ కేటగిరిలో ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు సైతం కూచిపూడి, భరతనాట్యాలతో మంత్రముగ్ధను చేశారు. అనంతరం రైటర్స్ అకాడమీ ఛైర్మన్ రమణమూర్తి, డాక్టర్ శ్రీధర్ బీత్ర పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్యాప్స్ ఫౌండర్ షావుకారి విజయలక్ష్మి, బల్ల శ్రీనివాస్, ప్రసాద్, ప్రమీలకుమారి, రోజా, మాధవి, వర్షిని తదితరులు పాల్గొన్నారు.

పలువురు అధికారులకు ఉత్తమ సేవా పురస్కారాలు


గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ హరేంధిరప్రసాద్ నుంచి ఉత్తమ సేవా పురస్కారాలు అందుకుంటున్న జీవీఎంసీ ఏడీసీ ఫణిరామ్, ఏసీపీ అప్పలరాజు, ఏసీపీ నర్సింహమూర్తి, సీతమ్మధార ఆర్ఐ షేక్ ఖాదర్‌బాబా, కలెక్టర్ పీఎస్ అనిల్‌కుమార్, విశాఖ రూరల్ సర్వేయర్ ఆర్వీ ప్రసాద్, ఆర్డీవో సంగీత్‌మాథుర్, డీఎస్పీ (ఏసీబీ) బీవీఎస్ నాగేశ్వరరావు, జలవనరుల శాఖ డీఈఈ రాజేంద్రకుమార్, రిజిస్ట్రేషన్ శాఖ సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, జీవీఎంసీ ఏడీసీ రమణమూర్తి, చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు, మూడో పట్టణ సీఎస్ హెచ్‌సీశ్రీనివాసరావు

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలి



కలెక్టర్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న జేసీ మయూర్ అశోక్



జెడ్పీ కార్యాలయంలో ప్రసంగిస్తున్న చైర్‌పర్సన్ సుభద్ర

మహారాణిపేట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాలని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. జెడ్పీ సీఈవో నారాయణమూర్తి జాతీయ జెండాను ఎగురవేయగా, చైర్‌పర్సన్ సుభద్ర సెల్యూట్ చేశారు. అనంతరం ఆమె గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి వందనం చేశారు. జెడ్పీ సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయంలో..

జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో 76వ గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ జాతీయ పతాకాన్ని ఎగురవేసి గౌరవ వందనం చేశారు. అనంతరం ప్రాంగణంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసి మిఠాయిలు పంచిపెట్టారు. డీఆర్వో భవానీశంకర్, ఏవో ఈశ్వరరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఉపసంచాలకుడు ఎస్వీ రమణ, జెట్టీలోని మత్స్యశికారి, మత్స్య దర్శిని నౌకలో ముఖ్య అధికారి డి.భామిరెడ్డి జాతీయ జెండాలు ఎగురవేసి గౌరవ వందనం చేశారు. మహారాణిపేటలోని సెంచూరియన్ క్లబ్‌లో శతాధిక వృద్ధుడు ఎం.రామరాజును ఘనంగా సత్కరించారు.

'నిజాయతీగా సేవలందిస్తా'

డాబాగార్డెన్స్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వృత్తిపై గౌరవం, క్రమశిక్షణ, నిజాయతీగా సేవ చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని జీవీఎంసీ జోనల్-4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఉద్ఘాటించారు. పోలీస్ పరేడ్ మైదానంలో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ నుంచి ప్రశంసా పత్రం అందుకున్న అనంతరం ఆయన స్పందించారు. నగరాభివృద్ధిలో తనవంతు పాత్ర నిర్వర్తిస్తానని తెలియజేశారు.



కనకమహాలక్ష్మి ఆలయం ఆవరణలో పతాకావిష్కరణ చేస్తున్న ఈవో కె.శోభారాణి

ఆదాయార్జనలో వాల్తేరు రైల్వే పురోగతి

విశాఖపట్నం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వేలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. రైల్వే ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ గ్రౌండ్‌లో డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనాన్ని సమర్పించారు. అనంతరం ఆర్పీఎఫ్ జవాన్ల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన ప్రసంగిస్తూ ఆదాయార్జనలో వాల్తేరు డివిజన్ పురోగతి సాధించిందని పేర్కొన్నారు. ఈ వార్షిక సంవత్సరంలో ఇప్పటివరకు 76.48 మిలియన్ టన్నుల సరకు రవాణాతో రూ.10,268 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. పైకప్పులపై అమర్చిన సౌరశక్తి ఫలకాల ద్వారా 1.73 మిలియన్ యూనిట్ల సౌరశక్తిని ఉత్పత్తి చేయడంతో ఈ ఏడాది రూ.64.81 లక్షల ఆదాయంలో మిగిలిందన్నారు. 130 కి.మీ వేగానికి అనుకూలంగా 200 కి.మీ ట్రాక్‌ను, 110 కి.మీ వేగానికి అనుగుణంగా 100 కి.మీ ట్రాక్‌ను మెరుగుపరిచామన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం మూడు వందేభారత్ రైళ్లను ప్రవేశపెట్టామని, పలు రైళ్లకు 39 అదనపు కోచ్‌లు జత చేశామన్నారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు నగదు బహుమతులు ప్రకటించారు. ఆర్పీఎఫ్ జవాన్లు ప్రదర్శించిన మోటారు బైక్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (కనస్ట్రక్షన్) అంకుష్ గుప్తా, ఏడీఆర్ఎం ఇ.శాంతారామ్, సీనియర్ డీపీవో జసుఫ్ కబీర్ అన్సారి, అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



గణతంత్ర దినోత్సవ సందేశమిస్తున్న డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు



రైల్వే అథ్లెటిక్ మైదానంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ద్విచక్ర వాహనంపై విన్యాసం చేస్తున్న వాల్తేరు రైల్వే ఉద్యోగులు

కరాటే టోర్నీలో చిన్నారులకు పతకాలు

విశాఖపట్నం, స్పోర్ట్సు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన జాతీయ, అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన క్రీడాకారులు పతకాలు సాధించారు. గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఈ టోర్నీలో దేశ వ్యాప్తంగా 1,500 మంది పాల్గొనగా, నగరంలోని ఆర్.మోహన వంశీ, బాలరాజు, కృష్ణవేణి వద్ద శిక్షణ పొందిన 15 మంది నగర క్రీడాకారులు పతకాలు సాధించడం విశేషం.



పతక విజేతలతో కోచ్‌లు బాలరాజు, వంశీ, కృష్ణవేణి

పతకాలు సాధించిన క్రీడాకారులు

బాలికల అండర్-8 విభాగంలో జి.సాత్విక రెండు స్వర్ణ పతకాలు, అండర్-12 కేటగిరిలో ఎం.నిఖిలాశ్రీ స్వర్ణం, కె.మేఘన కాంస్యం, అండర్-16 విభాగంలో ఎం.లక్ష్మి సౌమ్య, కె.లక్ష్మి మనోజ్ఞ, ఎస్.సంజన తలో కాంస్యం సాధించారు. బాలుర అండర్-12 విభాగంలో ప్రియూష్ రౌట్ రెండు కాంస్య పతకాలు, అండర్-14 కేటగిరిలో బి.త్రిలోష్, బి.కృష్ణ దక్ష చెరో కాంస్య పతకం, అండర్-16 విభాగంలో బి.గురువర్ధన్ కాంస్యం సాధించారు. అంతర్జాతీయ పోటీల్లో బాలికల అండర్-12 విభాగంలో ఎం.నిఖిలశ్రీ కాంస్య పతకం సాధించింది.

ప్రగతి పథంలో విశాఖ

... 3వ పేజీ తరువాయి

కొనసాగుతున్నాయన్నారు. ఉపాధిహామీ పథకం నుంచి రూ.16.55 కోట్లతో 11.64 కి.మీ సిమెంట్ రోడ్లు, రూ.2.9 కోట్లతో ఏడు కి.మీ. తారు రోడ్లు, రూ.3.22 కోట్లతో 173 గోకులాలకు షెడ్ల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయన్నారు. నగరానికి తాగునీరు, పరిశ్రమల అవసరాలకు కోసం గోదావరి నుంచి 23.44 టీఎంసీలు సరఫరాకు రూ.98.73 కోట్లతో పోలవరం ఎడమ ప్రధాన కాలువ ఎనిమిదో ప్యాకేజీకి పిలిచిన టెండర్లు ఖరారుదశలో ఉన్నాయన్నారు.

మహిళా సంఘాలకు చేయూత

జిల్లాలో 15,098 స్వయంశక్తి సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.866 కోట్ల రుణాలు, స్త్రీనిధి ద్వారా 5,286 సభ్యులకు రూ.26.44 కోట్ల రుణాలు అందజేశామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా 18 వసతిగృహాల్లో మెరుగైన వసతుల కల్పనకు రూ.203 లక్షలు విడుదల చేశామన్నారు. బీసీ వెల్ఫేర్ ద్వారా 38,017 మంది బీసీ/ఈబీసీ/కాపు విద్యార్థులకు రూ.30 కోట్ల పోస్టు మెట్రిక్. 38,109 మంది విద్యార్థులకు రూ.35.72 కోట్లు మంజూరుచేశామన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం రూ.54.44 కోట్ల రుణాలను 2313 యూనిట్లకు అందజేశామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఐదు తాగునీటి పథకాలు, 80 చిన్న పథకాలు, పారిశుధ్యానికి రూ.40 కోట్లు మంజూరుచేశామన్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ. 17.53 కోట్లతో 28 కి.మీ. 139 సీసీ రోడ్లు మంజూరుకాగా ఇంతవరకు 96 పనులు పూర్తి కాగా మిగిలినవి పురోగతిలో ఉన్నాయన్నారు. సెంటు స్థలంలో 1.39 లక్షల ఇళ్లకుగాను ఇంతవరకు 28,423 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. దీపం-2 పథకంలో పేదలకు ఉచిత సిలిండర్ల పంపిణీలో భాగంగా తొలివిడతగా 3,55,114 మందికి రూ.27.35 కోట్లు సబ్సిడీ బ్యాంకు ఖాతాలకు జమచేశామన్నారు.

సోలార్ విద్యుత్‌కు ఆదరణ

పీఎం సూర్యఘర్ బిజిలీ యోజన పథకం కింద ఇంటి పైకప్పులపై సోలార్ పలకల ఏర్పాటునకు జిల్లాలో ఐదువేల మంది దరఖాస్తు చేయగా ఇప్పటివరకు 800 ఇళ్లకు పలకలు అమర్చి గ్రిడ్‌కు అనుసంధానంచేశామని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో రూ.16,219 కోట్లతో నాలుగు భారీ, రూ.43.4 కోట్లతో 35 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు త్వరలో ఉత్పత్తులు ప్రారంభించనున్నాయని, దీంతో 35వేల మందికి ఉపాధి లభించనున్నదన్నారు. పర్యాటకశాఖకు పరిశ్రమల హోదా కల్పించడంతో జిల్లాకు భారీగా ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉందన్నారు. రుషికొండలో కొత్తగా ఐదు బోట్లు, ఫిషింగ్‌హార్బర్‌లో ప్రస్తుతం ఉన్న బోటింగ్ యూనిట్‌కు 50 సీట్ల సామర్థ్యం వరకు పెంచుతూ ప్రతిపాదనలు మంజూరుచేశామన్నారు. భూములకు సంబంధించి సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 7,098 అర్జీలు రాగా 60 శాతం పరిష్కరించామన్నారు. బీచ్‌రోడ్డులోవీఎంఆర్‌డీఏ చేపట్టిన హెలికాప్టర్ మ్యూజియం త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. కాకానినగర్ వద్ద వాహన రద్దీని పరిగణనలో తీసుకుని రూ.25 కోట్లతో అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదించామన్నారు. వీఎంఆర్‌డీఏ, సీఎస్ఆర్, పీపీపీ విధానంలో రూ.180 కోట్లతో 36 కి.మీ.పొడవైన రోడ్ల నిర్మాణాలకు అనుమతులు తీసుకున్నామని, కైలాసగిరిపై సాహసక్రీడలు, గ్లాస్‌స్కై వాకింగ్ బ్రిడ్జి త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి వరకు తీరం కోత నివారణకు రూ.200 కోట్లతో ప్రతిపాదించామన్నారు. ఏడాదికి రూ.3.33 కోట్లతో 25 అన్నక్యాంటీన్లను నిర్వహిస్తున్నామన్నారు. నగరంలో జనవరి ఒకటోతేదీ నుంచి ప్లాస్టిక్ నిషేధం అమల్లోకి వచ్చిందని, ప్రజలు సహకరించాలని కోరారు. సుమారు రూ.400 కోట్లతో రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలు, స్టేడియాలు మరమ్మతుల్లో కొన్ని పూర్తికాగా మరికొన్ని పురోగతిలో ఉన్నాయన్నారు. మధురవాడ, ముడసర్లోవలో రూ.595 కోట్లతో వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్, రూ.563 కోట్లతో మధురవాడలో డ్రైనేజీ నెట్‌వర్క్, పీపీపీ విధానంలో 15 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌కు ప్రతిపాదించామన్నారు. నగరంలో యూజీడీ వ్యవస్థ మెరుగుపర్చడానికి రూ.297 కోట్లతో చేపట్టిన రెండు ప్రాజెక్టులు ప్రారంభదశలోనే ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. తొమ్మిది ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన 446 మంది ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. చివరగా వస్తువుల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, డీసీపీ మేరీ ప్రశాంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలకు గుర్తింపుగా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ నుంచి ప్రశంసాపత్రాలు అందుకుంటున్న కలెక్టర్ కార్యాలయ ఇ-సెక్షన్ సూపరింటెండెంట్ కె.సుజాత, అర్బన్ ల్యాండ్ సీలింగ్ డిప్యూటీ తహసీల్దార్ విజయకుమారి, డీటీలు సుధీర్‌బాబు, బెహరా రవిశంకర్, జెడ్పీ-4 కమిషనర్ మల్లయ్యనాయుడు, వీఎంఆర్‌డీఏ సిటీ ప్లానర్ శిల్ప, కనకమహాలక్ష్మి ఆలయ ఈఈ వెంకటరమణ, కలెక్టర్ కార్యాలయ ఎ.ఒ. కె.వి.ఈశ్వరరావు

ఘనంగా పోలమాంబ పరస



అలంకరణలో పోలమాంబ అమ్మవారు

అల్లిపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం గోకుల్ థియేటర్ సమీపంలో ఉన్న రాచపోలమాంబ అమ్మవారి 21వ పరస మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. కార్పొరేటర్ కందుల నాగరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. సాయంత్రం విద్యుత్ దీపాలంకరణ, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేటి నుంచి టెన్నిస్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): అయిస్టా ఆధ్వర్యంలో నిర్వహించనున్న 18వ అఖిల భారత సీనియర్ జాతీయ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ సోమవారం ప్రారంభం కానుంది. ఆఫీసర్స్ క్లబ్ వేదికగా ఫిబ్రవరి 2 వరకు జరిగే ఈ టోర్నీలో ఢిల్లీ, కేరళ, రాజస్థాన్, బెంగాల్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఒడిశా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించనున్నారని టోర్నీ డైరెక్టర్ కె.సతీష్ తెలిపారు. పురుషుల 35, 45, 55, 65, 75 ప్లస్ ఏళ్ల విభాగాల్లో సింగిల్స్, డబుల్స్‌లో మ్యాచ్‌లు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి ఆఫీసర్స్ క్లబ్, సెంచరీ క్లబ్, ఏయూ టెన్నిస్ కోర్టులలో క్వాలిఫైయింగ్ మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. ఈ టోర్నీకి సమాంతరంగా చిన్నారులు, మహిళలకు కూడా ప్రత్యేకంగా టోర్నీ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ టోర్నీ వివరాలకు చెందిన పోస్టర్‌ను ఆఫీసర్స్ క్లబ్‌లో ఆవిష్కరించారు. క్వాలిఫైయింగ్ రౌండ్ పోటీలను ఎంపీ శ్రీభరత్ ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అయిస్టా ప్రతినిధులు డీఎస్ఎన్.రాజు, ప్రేమ్‌చంద్, అప్పలరాజు, ఏఎస్ఎన్.రాజు, కె.సతీష్ పాల్గొన్నారు.

యథేచ్ఛగా మాంసం విక్రయాలు

జ్ఞానాపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి ఆదేశాలు జ్ఞానాపురం, అల్లిపురం ప్రాంతాల్లో ఎక్కడా అమలు కాలేదు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నగరంలో ఎక్కడా మాంసం విక్రయించరాదని ఆదేశాలు ఉన్నా, బేఖాతరు చేశారు. యథేచ్ఛగా బహిరంగంగానే మాంసం విక్రయించారు. అధికారులు మొక్కుబడిగా అక్కడక్కడ దుకాణాలు మూయించినా, కొద్దిసేపటికే తెరుచుకున్నాయి. సరిగా అమలు చేయలేనప్పుడు ఉత్తుత్తి హెచ్చరిక ప్రకటనలు దేనికని జీవీఎంసీ అధికారుల తీరును ప్రజలు ఆక్షేపించారు.

ఘనంగా గణతంత్ర వేడుకలు



బీజేపీ కార్యాలయంలో పతాకావిష్కరణ చేసిన అనంతరం ప్రసంగిస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, చిత్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు తదితరులు



సీతంపేట జనసేన పార్టీ కార్యాలయంలో జాతీయ జెండాకు వందన సమర్పణ చేస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్. చిత్రంలో ఎన్‌సీసీ కేడెట్లు, పార్టీ నాయకులు తదితరులు

సీతమ్మధార/అక్కయ్యపాలెం/మాధవధార/జ్ఞానాపురం/కంచరపాలెం/మర్రిపాలెం/జగదాంబ కూడలి/డాబాగార్డెన్స్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర సంబరాలు ఆదివారం దక్షిణ, ఉత్తర నియోజకవర్గాల్లో ఘనంగా జరిగాయి. ప్రభుత్వ ప్రైవేటు, రాజకీయ పార్టీల కార్యాలయాలు, విద్యాసంస్థలు, పాఠశాలలు, కళాశాలలు, గ్రంథాలయాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధికార, అనధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్న వేడుకల్లో ప్రముఖులు గణతంత్ర సందేశాలిచ్చారు. ఆయా శాఖల్లో సాధించిన ప్రగతిని గుర్తుచేశారు. భాజపా కార్యాలయంలో ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, జనసేన కార్యాలయంలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌లు ఆయా పార్టీల ప్రముఖులతో కలిసి జాతీయ పతాకాలను ఎగురవేశారు. జీవీఎంసీ జ్ఞానాపురం జోనల్ 5, జోనల్ 4 కార్యాలయాల్లో కమిషనర్లు బి.రాము, ఎం.మల్లయ్యనాయుడు పతాకావిష్కరణలు చేసి గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మర్రిపాలెం వుడా కాలనీలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ప్రధాన కార్యాలయంలో సీఈఓ డీవీఎస్ వర్మ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) కార్పొరేట్ కార్యాలయంలో సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి మాట్లాడుతూఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సుమారు 76 లక్షల మంది వినియోగదారులకు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో నిరంతరాయంగా విద్యుత్ సేవలందిస్తున్నట్లు చెప్పారు. నక్కవానిపాలెం, కెఆర్ఎం కాలనీ, ప్రియదర్శిని కాలనీ కూడలిలో గల భారతమాత విగ్రహం వద్ద ఆచార్య కందర్ప విశ్వనాథ్ ఆధ్వర్యంలో పూజలు చేసి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జేజేలు పలికారు. కెఎస్ఆర్ ఫంక్షన్ హాలులో క్రెడాయ్, రోటరీక్లబ్ ఆధ్వర్యంలో 40 యూనిట్ల రక్తదానం చేశారు. మాధవధారలోని రవాణా శాఖ కార్యాలయంలో డిటిసి ఆదినారాయణ జెండా ఎగురవేశారు. కైలాసపురం సాలిగ్రామపురం ప్రాంతానికి చెందిన (పోర్టు ఉద్యోగి) జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ మర్రి సత్యనారాయణకు ఉత్తమ సేవా అవార్డు లభించింది. పోర్టు స్టేడియంలో విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ అంగముత్తు అవార్డు ప్రదానం చేశారు. జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన శ్రావ్యకు డాబాగార్డెన్స్ రమాదేవి భానోజీరావు ప్రాథమికోన్నత పాఠశాలలో జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేశారు. సూర్యాబాగ్‌లోని పాపహోమ్‌లో నిర్వహించిన వేడుకల్లో ఏపీ ఈపీడీసీఎల్ విజిలెన్స్ ఎస్పీ సీహెచ్ రామకృష్ణ ప్రసాద్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. సంస్థ అధ్యక్షుడు డి.సూర్యప్రకాశరావు, ప్రతినిధులు పాల్గొన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం దళితులతో పాటు ఇతర కులాల వారికి ఎంతో ఉపయోగపడుతోందని రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి డాక్టర్ సుహాసిని అన్నారు. అక్కయ్యపాలెం మండల బీజేపీ అధ్యక్షుడు గాదం నాగరాజు ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించారు.



ఏపీఈపీడీసీఎల్ కార్యాలయంలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న సీఎండీ పృథ్వీతేజ్

చికిత్స పొందుతూ మరో బాలిక మృతి



మహంతి ఇషిత (ఫైల్)

తగరపువలస, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా క్షణికావేశంలో ఇద్దరు బిడ్డలతో తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనలో మరో బాలిక మృతి చెందింది. భీమిలి మండలం చిట్టివలస ఆదర్శనగర్ కాలనీ గొల్లవీధిలో నివాసం ఉంటున్న మహంతి మాధవి (25) శుక్రవారం సాయంత్రం తన ఇద్దరు కుమార్తెలు ఇషిత (5), రితిక్ష (18 నెలలు)తో కలిసి పురుగుల మందు తాగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో శుక్రవారం అర్ధరాత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మాధవి మృతి చెందగా, శనివారం తెల్లవారుజామున చిన్న కుమార్తె రితిక్ష ప్రాణాలు విడిచింది. పెద్ద కుమార్తె ఇషిత నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున కన్నుమూసింది. మాధవి భర్త రామకృష్ణ ఫోన్‌కు వేరే యువతి నంబరు నుంచి వస్తున్న మెసేజ్‌ల కారణంగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. శుక్రవారం మధ్యాహ్నం భర్త విధులకు వెళ్లిపోగా మాధవి, తన ఇద్దరు పిల్లలకు ఆహారంలో పురుగుల మందు కలిపి పెట్టి, తాను తినింది. ఎంతో సరదాగా వుండే కుటుంబంలో ఘోరం జరిగిపోయిందంటూ స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ డ్రైవింగ్ విభాగంలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ పొందేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ తెలిపారు. శిక్షణ పొందగోరు అభ్యర్థులకు 21 ఏళ్ల వయసు ఉండాలన్నారు. అభ్యర్థులకు లైట్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్, ఏడాది అనుభవం ఉండాలన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఐటీఐ డ్రైవింగ్ విభాగంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 91779 67397 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కుటుంబ వివరాలపై సమగ్ర సర్వే

... 3వ పేజీ తరువాయి

ఖాతాలున్నాయని గుర్తించి, ఇప్పటివరకు 3,98,403 (99.49 శాతం) బ్యాంకు ఖాతాలకు ఈకేవైసీ పూర్తిచేశారు.

ఎంఎస్ఎంఈలపై ఆరా!

ఉపాధి కోసం పలు రకాల పరిశ్రమలు స్థాపించిన కుటుంబాల స్థితిగతులపైనా సమగ్ర సర్వే చేస్తున్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాలో ఇటువంటి పరిశ్రమలు 1,14,482 ఉండగా ఇంతవరకు 25,980 (22.6 శాతం) సర్వే చేశారు. ఆయా పరిశ్రమలపై ఆధారపడే కుటుంబాలు, ఉత్పత్తులు, స్థానికంగా విక్రయిస్తున్నారా లేక ఎగుమతి చేస్తున్నారా?, లభిస్తున్న ఆదాయం తదితర వివరాలు పొందుపరుస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంఎస్ఎంఈ యూనిట్‌లను ప్రోత్సహిస్తుండడం, సబ్సిడీలు, ఎగుమతులకు అనుకూలంగా విధానాలు రూపొందించడంతో ఎంఎస్ఎంఈ డేటా ఆ రంగాన్ని ప్రోత్సహించేందుకు వీలు కల్పిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

తప్పుల తడకగా నవశకం సర్వే

వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో నవశకం పేరిట హడావుడిగా సర్వే చేసింది. ఇందులో అనేక తప్పులు దొర్లాయి. కొంతమంది తప్పుడు ఆధార్, ఫోన్ నంబర్లు ఇచ్చారు. దీనిపై అప్పట్లోనే ఫిర్యాదులు వచ్చినా వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. ఆయా ఇళ్లలో నివసిస్తున్న వారికి, ఆధార్ నంబర్లకు పొంతన కుదరడం లేదు. దీనిని మిస్సింగ్ డేటాగా గుర్తించి, వారి వివరాల కోసం సర్వే చేస్తున్నారు. జిల్లాలో రెండు లక్షల మంది వివరాలు మిస్సింగ్ డేటాలో ఉన్నట్టు గుర్తించిన సిబ్బంది ఇప్పటివరకు 72,873 మంది వివరాలు తెలుసుకున్నారు. మిగిలిన వారి వివరాలను సేకరించే పనిలో ఉన్నామని డీఎల్‌డీవో ఉషారాణి వివరించారు.

నగరానికి మంత్రి నారా లోకేశ్

... 3వ పేజీ తరువాయి

అందజేసి ఆశీర్వదించాలని కోరగా ఆయన నవ్వుతూ తీసుకున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి నగరంలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్న మంత్రికి భీమిలి, విశాఖ తూర్పు ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మంత్రి లోకేశ్‌ను కలిశారు. గత ఏడాది మైదాన ప్రాంతం నుంచి ఎక్కువమందిని ఏజెన్సీకి బదిలీ చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ తమను తిరిగి మైదానానికి బదిలీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కాగా మంత్రి లోకేశ్ సోమవారం సాక్షిపై వేసిన పరువునష్టం కేసు విచారణలో జిల్లా కోర్టుకు హాజరుకానున్నారు.

శోకిస్తున్న వైశాఖి

... 3వ పేజీ తరువాయి

చెల్లించాలి. అది కలిపితే సుమారుగా కోటి రూపాయలు అద్దెగా ఇవ్వాలి. అది కాకుండా అక్కడ జరిగే వ్యాపారంలో కొంత శాతం ఇవ్వాల్సి ఉంటుందని మరో నింబంధన ఉంది. అంటే ఎలా లేదన్నా నెలకు రూ.1.25 కోట్లు చెల్లించాలి. అది లాభదాయకం కాదని, అక్కడ అంత వ్యాపారం జరగదని వ్యాపారులు ఎవరూ ముందుకు రాలేదు. దాంతో వైశాఖి జల ఉద్యావనం ప్రాజెక్టు ఏడాదిన్నరగా ఆగిపోయింది. దానిని ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై అధికారులు కూడా ఏమీ ఆలోచించడం లేదు. ప్రస్తుతం అది ఖాళీగా ఉండడంతో ఆకతాయిల అడ్డాగా మారిపోయింది.

అధికారులతో చర్చిస్తాం

ఇటీవల నిర్వహించిన ప్రజాదర్బార్‌లో దక్షిణ నియోజకవర్గ కూటమి నాయకులు కలిశారు. ఆ పరిధిలో అది ఒక్కటే వినోద కేంద్రమని, అభివృద్ధి చేయాలని కోరారు. అధికారులతో చర్చించి, ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలో ఆలోచిస్తాం.

- ఎంవీ ప్రణవ్ గోపాల్, చైర్మన్, వీఎంఆర్‌డీఏ

వాడవాడలా గణతంత్ర సంబరాలు

గణతంత్ర దినోత్సవం సందర్భంగా తూర్పు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేటు సంస్థలు, విద్యాలయాలు, రాజకీయ పార్టీల కార్యాలయాలు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం సిద్ధించిన రోజును తలచుకొని ఉప్పొంగిపోయారు. ఉదయం నుంచి పతాకావిష్కరణలతో ఆయా ప్రాంతాల్లో సందడి నెలకొంది.


ఎంవీపీ కాలనీ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటర్ మంగవేణి


సిరిపురం : జెండాను ఎగురవేస్తున్న ఎస్బీఐ డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్‌కుమార్


ఆరిలోవ : సీబీడీ కార్యాలయం వద్ద జెండాకు అభివాదం చేస్తున్న ఏఎస్పీ డాక్టర్ ప్రేమకాజల్

ఎంవీపీ కాలనీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని సెవెన్త్ డే అడ్వంటిస్ట్ స్కూలు, ఏఎస్ రాజా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జీవీఎంసీ 18వ వార్డులోని ఎంవీపీ సర్కిల్ వద్ద కార్పొరేటర్ గొలగాని మంగవేణి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే వెలగపూడి జెండా ఎగురవేశారు. గిరిజన్ భవన్, డీఆర్డీఏ, ఎంవీపీ పోలీస్ స్టేషన్, హౌసింగ్ కార్పొరేషన్, పలు ప్రైవేటు విద్యా సంస్థల్లో ఆయా కార్యాలయాలు, సంస్థల అధిపతులు పతాకావిష్కరణ చేశారు. విశాఖపట్నం పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో ఆరో సెక్టర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఏబీసీ పార్కులో వేడుకలు నిర్వహించారు. అలాగే ప్రభుత్వ మత్స్యకార పాఠశాలలో జరిగిన వేడుకల్లో లైన్స్ క్లబ్ ద్వారకానగర్ అధ్యక్షుడు జీబీ కుమార్ పాల్గొన్నారు.

పెదవాల్తేర్‌లో..

పెదవాల్తేరు : జీవీఎంసీ 21వ వార్డు చినవాల్తేరులోని లిల్లీ వైట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఓమ్మి అనిల్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి.వేణు, గోపాలరావు, డి.నాగేశ్వరరావు, శేఖర్‌పాల్గొన్నారు.

ఆరిలోవలో..

ఆరిలోవ : దీనదయాళ్‌పురంలో గల ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో నిర్వహించిన వేడుకల్లో సూపరింటెండెంట్ వీరయ్య, విమ్స్‌లో డైరెక్టర్ కె.రాంబాబు, పెదగదిలిలోని మండల ప్రాథమిక పాఠశాలలో బి.గోవింద, చినగదిలిలోని మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కిరణ్‌పాల్, ఇందిరా గాంధీ జంతు ప్రదర్శన శాలలో జూ క్యూరేటర్ జి.మంగమ్మ, జిల్లా పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో జేడీ రామకృష్ణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే కేంద్ర కారాగారంలో సూపరింటెండెంట్ మహేశ్‌బాబు, సీబీడీ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ డాక్టర్ జి.ప్రేమకాజల్ జాతీయ జెండాలను ఎగుర వేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మద్దిలపాలెంలో..

మద్దిలపాలెం : మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ విజయబాబు జాతీయ జెండా ఆవిష్కరించి గౌరవవందనం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ బి.సుజాత జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్స్ పిరమిడ్స్ విన్యాసాలు చేశారు. బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం : జీవీఎంసీ 15వ వార్డులోని పాత వెంకోజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం సీహెచ్ జ్యోతి జాతీయ జెండా ఎగురవేశారు. జేఆర్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్. కెఎస్ఆర్ మూర్తి, గ్రామస్థులు పాల్గొన్నారు. వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. జేఆర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ బుద్ధ విగ్రహం వద్ద జెండా వందనం చేపట్టారు. అలాగే 16వ వార్డులోని ఇసుకతోట అంబేడ్కర్ కాలనీలో ఏపీఐఐసీ మాజీ డైరెక్టర్ మొల్లి అప్పారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. పాత వెంకోజీపాలెంలోని శ్రీసీతారామ సేవా సంఘం ఆధ్వర్యంలో రామాలయం వద్ద జెండా వందన కార్యక్రమం జరిగింది.

సిరిపురంలో..

సిరిపురం : రాజ్యాంగ ముసాయిదా కమిటీ రూపొందించిన భారత రాజ్యాంగం 1950 జనవరి 26న అమలులోకి వచ్చిందని భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ పంకజ్‌కుమార్ పేర్కొన్నారు. సిరిపురం ఎస్‌బీఐ ప్రధాన అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయ ఆవరణలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక ఆర్ఎంలు, ఏజీఎంలు, ఆఫీస్ బేరర్స్, యూనియన్ అండ్ ఎస్ఈడబ్ల్యుఏ, ఏట, ఆర్‌బీట, స్టాఫ్,పెన్షనర్స్ పాల్గొన్నారు.

రామ్‌నగర్‌లో..

రామ్‌నగర్ : నెహ్రూనగర్ రెసిడెన్షియల్ అసోషియేషన్ ఆధ్వర్యం లో టీడీపీ 28వ వార్డు ఇన్‌చార్జి నక్కా కనకరాజు వేడుకలు నిర్వహించారు. పారిశ్రామికవేత్త భరిణికాన రామారావు పతాకావిష్కరణ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు భూసర విఘ్నేశ్వరరావు, కార్యదర్శి అక్కరమాని సతీష్ తదితరులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.


వెంకోజీపాలెం : పాత వెంకోజీపాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో వేడుకలు


రామ్‌నగర్ : నెహ్రూనగర్‌లో జెండా ఎగుర వేస్తున్న స్థానికులు


మద్దిలపాలెం : కృష్ణా జూనియర్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్ల విన్యాసాలు

జీవీఎంసీలో పతాకావిష్కరణ


పతాకావిష్కరణలో పాల్గొన్న ఇన్‌చార్జి కమిషనర్ హరేంధిరప్రసాద్, మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ అధికారులు

వెంకోజీపాలెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : దేశ ప్రజలకు గణతంత్ర దినోత్సవ ఫలాలు అందాలని జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన 76వ భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నగర మేయరు గొలగాని హరి వెంకటకుమారితో కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర సాధనకు కృషి చేసిన ఎందరో మహనుభావులకు వందనాలను తెలియజేశారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

వీఎంఆర్డీఏలో..

సిరిపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : మనకు స్వాతంత్ర్యం ఎందరో మహనుభావులు తమ ప్రాణ త్యాగాల ఫలితమేనని వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ పేర్కొన్నారు. ఆదివారం సిరిపురం వీఎంఆర్డీఏ కార్యాలయ ఆవరణలో 76వ గణతంత్ర వేడుకలను నిర్వహించారు. జాతీయ పతాకాన్ని కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనమంతా మన బాధ్యతను గుర్తించి కష్టపడి పనిచేస్తే విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దోహదపడాలని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, చీఫ్ ఇంజనీర్ భవానీ శంకర్, ఇంజనీర్ బలరామరాజు, సుజాత శివానీ, దయానిధి, హరిప్రసాద్, శిల్పా తదితరులు పాల్గొన్నారు.


పతాకావిష్కరణ చేస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

ఘనంగా పంచాయతన హోమాలు

ఎంవీపీ కాలనీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలోని శ్రీసరస్వతీ సహిత పంచాయతన యాగ మహోత్సవం రెండో రోజైన ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీశారదా విద్యానికేతన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం విశ్వక్సేన ఆరాధన, హయగ్రీవ మాలామంత్ర హవనం, వేంకటేశ్వరస్వామి కల్యాణం, ఊంజల్ సేవ, సప్తవాద్య తరంగిణి, స్వరార్చన, భగవన్నామ సంకీర్తన నిర్వహించారు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు విఘ్నేశ్వర పూజతో మొదలైంది. విద్యార్థులు ఆలపించిన భక్తిగీతాలు, పలు సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం),కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 14, వంకాయలు (తెలుపు)24, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 52, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 46, బీరకాయలు 52, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 16, క్యారెట్ 28 దొండకాయలు 44, బంగాళదుంపలు 25, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)46, బరబాటి 42, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 24, దోస కాయలు 32, వె ల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 48, పొటల్స్ 80, కీరదోస 34, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 40, కంద 56, దేముడు చిక్కుడు 38, గోరు చిక్కుడు 30, ఆగాకార దేశవాళి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 26, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 150, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 20, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

డ్రోన్‌తో జాతీయ జెండా

విశాఖపట్నం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం నగరానికి చెందిన వైజాగ్ ఎరోల్యాబ్ టీమ్ ఆర్కే బీచ్‌లో డ్రోన్ సాయంతో జాతీయ పతాకాన్ని గాలిలోనికి ఎగురవేశారు. ఒకేసారి రెండు డ్రోన్‌ల సాయంతో ఎగురవేసిన జాతీయపతాకాలు ఆకాశంలో కనువిందుచేశాయి. ఈ సమయంలో అక్కడే ఉన్న వైజాగ్ వెదర్‌మ్యాన్ సాయికిరణ్ తన సెల్ ద్వారా చిత్రీకరించి ఎక్స్‌లో పోస్టుచేశారు. గణతంత్ర దినోత్సవం కావడంతో బీచ్‌కు పెద్ద సంఖ్యలో వచ్చిన సందర్శకుడు డ్రోన్లతో జాతీయ పతాకం ఎగురవేయడాన్ని ఆసక్తిగా తిలకించారు.


బీచ్‌లో డ్రోన్ సాయంతో జాతీయ పతాకాన్ని ఎగురవేసిన దృశ్యం

బీజేపీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం


పతాకాన్ని ఎగుర వేస్తున్న పరశురామ్‌రాజు

పెదవాల్తేరు, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగం ఆమోదించిన స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, సార్వభౌమాధికారం అంది వచ్చిన రోజే గణతంత్ర దినోత్సవమని ఉత్తర నియోజకవర్గఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం నగర బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పరశురామ్‌రాజు ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలను నిర్వహించి జాతీయపతాకాన్నిఆవిష్కరించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పీవీఎన్ మాధవ్, సీనియర్ నేతలు సురేంద్ర మోహన్, నాగేంద్ర, సుహాసినీఆనంద్, దిలీప్ కుమార్, బీజేపీ జిల్లా, మండల, వార్డు అధ్యక్షులు, నాయకులు, కర్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో..

మద్దిలపాలెం : మద్దిలపాలెంలోని వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలెక్టర్ బంగ్లాలో హైటీ వేడుకలు


హై టీ పార్టీలో కలెక్టర్ హరేంధిరప్రసాద్, డాక్టర్ సూర్యారావు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు

సిరిపురం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ బంగ్లాలో హైటీ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలలో 'పద్మశ్రీ' అవార్డు గ్రహీత, ప్రముఖ వైద్యుడు కూటికుప్పల సూర్యారావు, రాజకీయ ప్రముఖులు, నేవీ, పోలీస్, జిల్లా అధికారులు భాగస్వామ్యమయ్యారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. దేశభక్తి గీతాలతో గేయాలతో నృత్యాలతో చిన్నారులు జిల్లా అధికారులను అలరించారు.చివరగా కలెక్టర్ హరేంధిరప్రసాద్, డా.కూటికుప్పల సూర్యారావుతో కలిసి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ శ్రీనివాస్, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ వరదు కల్యాణి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్, ఎన్టీఆర్ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, జాయింట్ కలెక్టర్ మయూర్ ఆశోక్, జీసీసీ ఎండీ కల్పనాకుమారి, డీసీపీ 1 అజిత, డీసీపీ 2 మేరీ ప్రశాంతి, డీఆర్వో భవానీశంకర్, విశాఖ, భీమిలి ఆర్డీవోలు, అధికారులు పాల్గొన్నారు.

ఏయూలో మువ్వెన్నల రెపరెపలు

వెంకోజీపాలెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఏయూలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏయూ బాస్కెట్ బాల్ మైదానంలో నిర్వహించిన వేడుకల్లో వీసీ జి.శశిభూషణరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఆలోచన విధానాలలో దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపే బాధ్యత యువతపైనే ఉందన్నారు. అంతకుముందు ఏయూ పరిపాలన భవనం వద్దనున్న మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు, అంబేద్కర్ లా కళాశాల ప్రాంగణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఏయూ వీసీ, రెక్టార్ ఎన్.కిషోర్‌బాబు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయరావులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏయూ బాస్కెట్ బాల్ మైదానంలో నిర్వహించిన వేడుకలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, ఏయూ సెక్యూరిటీ, ఏయూ క్రీడా విభాగం గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో పలువురు ఏయూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


సెకూరిటీ, ఏయూ క్రీడా విభాగం గౌరవ వందనం స్వీకరిస్తున్న వీసీ శశిభూషణరావు

ఢిల్లీ గణతంత్ర వేడుకల్లో ఎస్ఆర్‌పురం సర్పంచ్


ఎస్ఆర్‌పురం సర్పంచ్ దూది విజయలక్ష్మికి మెమెంటో అందజేస్తున్న కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్

పెందుర్తి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి):దేశ రాజధానిలో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకలకు మండలంలోని ఎస్ఆర్ పురం సర్పంచ్ దూది విజయలక్ష్మి హాజరయ్యారు,ఈ సందర్భంగా ఇండియన్ గేట్ వే పరేడ్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు అంశాలను పంచాయతీలో అమలుచేసి, అభివృద్ధి సాధించినందుకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ చేతుల మీదుగా సర్పంచ్ విజయలక్ష్మి మెమెంటో అందుకున్నారు. గణతంత్ర వేడుకలకు రాష్ట్రవ్యాప్తంగా 25 మంది సర్పంచులు ఎంపికవగా విశాఖ జిల్లా నుంచి ఎస్ఆర్‌పురం సర్పంచ్ విజయలక్ష్మికి స్థానం లభించింది.

బాలకృష్ణకు పద్మభూషణ్‌పై హర్షం


ఎమ్మెల్యే కార్యాలయం వద్ద కేకు కట్ చేస్తున్న వెలగపూడి రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : సినీ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణకు పద్మభూషణ్ ప్రకటించిన నేపథ్యంలో తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కార్యాలయం వద్ద సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేకు కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోతనరెడ్డి, కాళ్ల శంకర్, గొలగాని పోలరావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం



మద్దిలపాలెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : సీబీఎం కాంపౌండ్ టింపనీ స్కూల్ మెయిన్ గేట్ ఆటో స్టాండ్ వద్ద ఆదివాం ఉదయం గుర్తు తెలియని యువకుడు మృతదేహం లభ్యమైంది. సుమారు 30 ఏళ్లుంటాయి. యువకుడు చలనం లేకుండా పడిఉండడంతో స్థానికులు త్రీటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. యువకుడి వివరాలు తెలిసిన వారు మూడోపట్టణ పోలీస్‌స్టేషన్ లేదా 7995095321 నంబర్‌కు తెలియజేయాలని ఎస్ఐ సురేష్‌కుమార్ తెలిపారు.

అలరించిన విద్యార్థుల నృత్యాలు



నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

మద్దిలపాలెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) :క్యాప్స్ మూడో వార్షికోత్సవం సందర్భంగా పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం ఆల్ ఇండియా నృత్య పోటీలు నిర్వహించారు. సీనియర్, జూనియర్, సబ్ జూనియర్ కేటగిరిల్లో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కూచిపూడి, భరతనాట్యం నృత్యాలతో పోటాపోటీగా ప్రదర్శనలిచ్చారు. సీనియర్స్ కేటగిరిలో ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు సైతం కూచిపూడి, భరతనాట్యాలతో మంత్రముగ్దును చేశారు. అనంతరం రైటర్స్ అకాడమీ చైర్మన్ రమణమూర్తి, డాక్టర్ శ్రీధర్ బీత్ర పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో క్యాప్స్ ఫౌండర్ షావుకారి విజయలక్ష్మి, బల్ల శ్రీనివాస్, ప్రసాద్, ప్రమీలకుమారి, రోజా, మాధవి, వర్షిని తదితరులు పాల్గొన్నారు.

పలువురు అధికారులకు ఉత్తమ సేవా పురస్కారాలు


గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ హరేంధిరప్రసాద్ నుంచి ఉత్తమ సేవా పురస్కారాలు అందుకుంటున్న జీవీఎంసీ ఏడీసీ ఫణిరామ్, ఏసీపీ అప్పలరాజు, ఏసీపీ నర్సింహమూర్తి, సీతమ్మధార ఆర్ఐ షేక్ ఖాదర్‌బాబా, కలెక్టర్ పీఎస్ అనిల్‌కుమార్, విశాఖ రూరల్ సర్వేయర్ ఆర్వీ ప్రసాద్, ఆర్డీవో సంగీత్‌మాథుర్, డీఎస్పీ (ఏసీబీ) బీవీఎస్ నాగేశ్వరరావు, జలవనరుల శాఖ డీఈ రాజేంద్రకుమార్, రిజిస్ట్రేషన్ శాఖ సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, జీవీఎంసీ ఏడీసీ రమణమూర్తి, చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు, మూడో పట్టణ సీఐ హెచ్‌.శ్రీనివాసరావు

తిరుమలనగర్‌లో సమస్యల కూత


అనధికార డంపింగ్ యార్డుతో అవస్థలు

నిర్మాణానికి నోచుకోని స్పోర్ట్స్ కాంప్లెక్స్

ప్రజల వద్దకే ప్రజాప్రతినిధులు, అధికారులు

- సమస్యలను నేరుగా వారికే వివరించే అవకాశం
- పరిష్కారమయ్యే వరకు 'ఆంధ్రజ్యోతి' అక్షరం అండ
- తిరుమల నగర్‌లో ప్రత్యేక కార్యక్రమం రేపు

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అక్షరమే ఆయుధంగా ప్రభుత్వ వైఫల్యాలు, అధికారులు, ప్రజాప్రతినిధుల అవినీతి, అక్రమాలను వెలికితీసిన ఆంధ్రజ్యోతి ఇప్పుడు ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులకు మధ్య వారధిగా నిలిచే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రజల వద్దకు తీసుకువెళ్లి, సమస్యలను నేరుగా వారికే చెప్పుకునే అవకాశం కల్పిస్తోంది. వారి నుంచి హామీ లభిస్తే పరిష్కరించేవరకు 'ఆంధ్రజ్యోతి అక్షరం 'ద్వారా ప్రజలకు అండగా నిలవనున్నది. ఈనెల 28న గాజువాక సమీప వడ్లపూడిలోని తిరుమలనగర్‌లో తొలి కార్యక్రమాన్ని నిర్వహించబోతోంది.

జీవీఎంసీ 87వార్డు పరిధి వడ్లపూడి సమీపంలో ఆటోనగర్‌ను ఆనుకుని వున్న తిరుమలనగర్‌లో 1200 నివాసాలున్నాయి. వడ్లపూడి జంక్షన్ నుంచి తిరుమలనగర్ దారిలో గాంధీబొమ్మ జంక్షన్ వరకు, గవరవీధి నుంచి కూర్మన్నపాలెం వరకు వీధిదీపాలు లేకపోవడంతో రాత్రిపూట చీకటి రాజ్యమేలుతోంది. దీనివల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. దీనిని అధిగమించేందుకు వడ్లపూడి జంక్షన్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకు, గవరవీధి నుంచి కూర్మన్నపాలెం వరకు రోడ్డుపై సెంటర్‌లైటింగ్ ఏర్పాటుచేయాలని స్థానికులు చాలాకాలంగా విజ్ఞప్తిచేస్తున్నారు. అయినా ఇంతవరకు పరిష్కారం కాలేదు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ స్థలం

సిద్ధార్థనగర్ కాలనీలో 4.38 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. అక్కడ స్పోర్ట్స్‌కాంప్లెక్స్ నిర్మించాలని ఏళ్లుగా వినతులందుతున్నాయి. దీంతో గత టీడీపీ ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పట్టించుకోకపోవడంతో మరుగునపడిపోయాయి. దీంతో తుప్పలు, పిచ్చిమొక్కలు పెరిగి అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. స్థానికులు ఇటీవల తుప్పలను తొలగించారు. ఆక్రమణదారులతో ప్రభుత్వ స్థలం కుచించుకుపోతోంది. ఇప్పటికైనా స్పోర్ట్స్‌కాంప్లెక్స్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. వడ్లపూడి పెట్రోల్ బంకు జంక్షన్ నుంచి పాతకూర్మన్నపాలెం వరకు, గాంధీబొమ్మ జంక్షన్ నుంచి ఆటోనగర్ వరకు, గాంధీబొమ్మ జంక్షన్ నుంచి ఎంవీవీ అండ్ ఎంకే అపార్టుమెంట్ వరకు రోడ్డుకి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు నిర్మించి, సెంటర్‌లైటింగ్ ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై జీవీఎంసీ అధికారులకు విన్నవించినా స్పందన కనిపించడం లేదని వాపోతున్నారు.

డంపింగ్ యార్డుగా మారిన ఖాళీ స్థలం

తిరుమలనగర్-ఆటోనగర్ మధ్య ఏపీఐఐసీకి చెందిన ఖాళీస్థలాన్ని కొంతమంది డంపింగ్‌యార్డుగా మార్చేశారు. స్థలం పరిరక్షణకు ఏపీఐఐసీ చర్యలు తీసుకోకపోవడంతో ఆటోనగర్‌లోని పరిశ్రమల వ్యర్థాలను డంప్ చేసి, నిప్పు అంటిస్తుండడంతో దట్టమైన పొగ కాలనీవాసులను ఉక్కిరిబిక్కిరిచేస్తోంది. ఖాళీస్థలానికి ప్రహరీ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ, ఏపీఐఐసీ అధికారులను కోరగా హామీ ఇచ్చారు. ఇంతవరకు ఆచరణలోకి రాలేదు.



తిరుమల నగర్ కాలనీ ముఖ ద్వారం



తిరుమల నగర్ కాలనీ సమీపంలోని డంపింగ్ యార్డు

వానాకాలంలో నీట మునుగుతున్న కాలనీ

ఏపీఐఐసీలోని పరిశ్రమల నుంచి వచ్చే డ్రైనేజీకి తిరులమనగర్ తర్వాత అవుట్‌లెట్ లేక వర్షాకాలంలో కాలనీ నీటమునుగుతోంది. దీనివల్ల విషపురుగులు చేరిపోతున్నాయి. వాహనాలు పాడైపోతున్నాయి. ఏపీఐఐసీ ఖాళీస్థలం మీదుగా 20 మీటర్ల డ్రైనేజీ నిర్మిస్తే పరిష్కారం లభిస్తుంది. జీవీఎంసీ, ఏపీఐఐసీ అధికారులు స్పందించాలని కోరుతున్నారు. కాలనీలోని పార్కుల్లో ఆకతాయిల ఆగడాలు పెరిగిపోతున్నాయి. విద్యార్థినులు, మహిళలను వేధించడం, చీకటిపడగానే గంజాయి సేవించడం వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. రాత్రివేళ పార్కులోని గేట్లను విరిచేసి, ఆట పరికరాలను ధ్వంసం చేస్తున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటుచేయాలంటున్నారు. కాగా దువ్వాడ రైల్వేస్టేషన్, వడ్లపూడికి గతంలో బస్సు సర్వీసు ఉండేది. రైల్వేలైన్ క్రాసింగ్ వద్ద ఆలస్యమవుతోందని రద్దు చేశారు. తాజాగా గేటు సమస్య తొలగింది. బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

- వడ్లపూడి చేపలమార్కెట్ వద్ద డ్రైనేజీ లేక వర్షాకాలంలో చెరువుని తలపిస్తోంది. సీసీ డ్రైనేజీ నిర్మాణంతో పాటు రోడ్డు వెంబడి మొక్కలు నాటాలని వ్యాపారులు వేడుకుంటున్నారు. అలాగే ఎంవీవీ అండ్ ఎంకే అపార్టుమెంట్ నుంచి వడ్లపూడి హైవేవరకు ప్రధాన రహదారికి ఇరువైపులా డ్రైనేజీ నిర్మించాలని స్థానికులు ఎప్పటి నుంచో అధికారులను కోరుతున్నారు. సమస్య పరిష్కారం కాలేదు.

రోడ్డుపై ఉన్న దుకాణాలతో ట్రాఫిక్ సమస్యలు

కణితి మీసేవ సెంటర్‌కుఆనుకుని రైల్వేమార్కెట్‌లో రోడ్డుపైనే దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. దీనివల్ల ట్రాఫిక్‌ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరోవైపున నిర్మించిన రైతుబజార్‌లోని దుకాణాల్లో వ్యాపారులు లేక నిరుపయోగంగా ఉంది. రోడ్డుపైన దుకాణాలను తొలగించి, రైతుబజార్‌లోకి తరలిస్తే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అలాగే రైతుబజార్‌కు వెళ్లే రోడ్డుని సీసీ రోడ్డుగా మార్చాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వడ్లపూడి మెయిన్‌రోడ్డుని ఆనుకుని శిథిలావస్థలో ఉన్న మీసేవా కేంద్రాన్ని కూల్చివేసి, సచివాలయ భవనాన్ని నిర్మించాలనే డిమాండ్ ఉంది. ప్రస్తుతం కల్యాణమండపాల్లో కొనసాగుతున్న సచివాలయాలను తరలిస్తే,రెండు కల్యాణ మండపాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.



కణితిలో స్పోర్ట్సు కాంప్లెక్స్ కోసం కేటాయించిన స్థలం



కణితిలో నిరుపయోగంగా ఉన్న డైలీ చేపల మార్కెట్

కాలుష్య సమస్యను పరిష్కరించాలి



ఆటోనగర్ పరిశ్రమల నుంచి వెలువెడుతున్న కాలుష్యం కారణంగా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. విషపూరిత వాయువుల కారణంగా చిన్నారులు, వృద్ధులు అనారోగ్య సమస్యల బారినపడుతున్నారు. ఇప్పటికే చాలామంది శ్వాసకోశ వ్యాధులతో సతమతమవుతున్నారు. కాలుష్య సమస్యపై పలుమార్లు అధికారులకు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు వినతిపత్రాలు అందించినా తూతూమంత్రంగానే చర్యలు చేపడుతున్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

- జి.విశ్వేశ్వరరావు, తిరుమలనగర్

రైతు బజారును ఏర్పాటు చేయాలి



రహదారులపై ప్రమాదాలు జరగకుండా రోడ్ల పక్కన ఉన్న షాపులను తరలించి, మీ-సేవ, చేపల మార్కెట్ వద్ద ఖాళీగా ఉన్న షాపుల వద్ద రైతు బజారును ఏర్పాటు చేయాలి. దశాబ్ద కాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ బొండా జగన్ పరిష్కరింలి. అందుకు అధికారులు సహకరించాలని వేడుకుంటున్నాం.

- కారుమూరి మహేశ్, కణితి

అనధికార డంపింగ్ యార్డుతో ఇబ్బందులు

- ఎం.పరమానందం, తిరుమలనగర్ కాలనీ అసోషియేషన్ వర్కింగ్ జనరల్ సెక్రటరీ



తిరుమల నగర్ కాలనీని ఆనుకుని ఉన్న ఏపీఐఐసీకి చెందిన ఖాళీ స్థలంలో పరిశ్రమల వ్యర్థాలను పడేస్తున్నారు. ఏళ్ల తరబడి వ్యర్థాలను అక్కడే వేస్తుండడంతో కొండలా పేరుకుపోయాయి. వాటి నుంచి తీవ్రమైన వస్తున్న వస్తుండడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పైగా యార్డులోని ప్లాస్టిక్ వ్యర్థాలకు తరచూ నిప్పు పెడుతుండడంతో దట్టమైన పొగలు కాలనీని చుట్టుముడుతున్నాయి. దీంతో చిన్నారులు, వృద్ధులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. దీనిపై ఏపీఐఐసీ అధికారులతో పాటు జీవీఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశాం. ఖాళీ స్థలానికి రక్షణ గోడ నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుంది.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలి

- ప్రగడ నారాయణరావు, సిద్ధార్థనగర్‌కాలనీ



సిద్ధార్థ నగర్‌లో నాలుగు ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఏళ్ల తరబడి ఖాళీగా ఉంది. ప్రస్తుతం ఇది కబ్జాకు గురవుతోంది. ఇక్కడ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తామని దశాబ్దం కిందట అధికారులు పేర్కొన్నా, ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. అందువల్ల త్వరితంగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి

- ఎస్ఎస్ విజయరామరాజు, కణితి



వడ్లపూడి నుంచి గాంధీ బొమ్మ వరకు ప్రతి కూడలిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. ఇటీవల కాలంలో దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. దొంగలను పట్టుకునేందుకు పోలీసులకు సీసీ కెమెరాలు వాళ్లకు దొంగలు పట్టుకోవటంలో ఉపయోగకరంగా ఉంటుంది.

వైభవంగా అక్కిరెడ్డిపాలెం పరస



కుంచుమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల పరసలో పాల్గొన్న భక్తజనం

అక్కిరెడ్డిపాలెం, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో అతిపెద్ద జాతరగా పేరొందిన అక్కిరెడ్డిపాలెం కుంచుమాంబ, దుర్గమాంబ అమ్మవార్ల పరసను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఏటా గణతంత్ర దినోత్సవం నాడు ఇక్కడ పరసను నిర్వహించడం ఆనవాయితీ. వేకువజాము నుంచే అమ్మవార్లను దర్శించేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు విచ్చేసి పసుపు కుంకుమలు, మొక్కులు చెల్లించారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, కార్పొరేటర్ గుడివాడ అనూష, వైసీసీ నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, గుడివాడ లతీశ్, సంగ్రాన నూకరాజు, వి.వెంకటరమణ, కాద సత్యారావు, బీవీ రమణ తదితరులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం పరసలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

సరిపల్లిలో ముత్యమాంబ..

పెందుర్తి: మండలంలోని సరిపల్లిలో ముత్యమాంబ పరస సందడిగా సాగింది. విద్యుత్ దీపాలతో ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలను అలంకరించారు. అమ్మవారిని శోభాయమానంగా అలంకరించగా, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం సంబరంలో కోలాటాలు, చిడతలు సాముగారడీ, తదితర సాంస్కృతిక ప్రదర్శనలు, అందరినీ ఆకట్టుకున్నాయి.

లక్ష్మీపురంలో ముత్తప్ప స్వామి..

పెందుర్తి-రూరల్: గ్రేటర్ 95వ వార్డు పరిధి లక్ష్మీపురంలో ముత్తప్ప స్వామి పరసను పురస్కరించుకుని పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి విచ్చేసి పూజలు చేశారు. కాగా పరస నిర్వాహకులు పి.పైడిరాజు కుటుంబ సభ్యులు మలేషియా నుంచి వలస వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. అందువల్ల మలేషియాకు చెందిన పలువురు భక్తులు ఇక్కడకు వచ్చి ముత్తప్ప స్వామి పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు.

లేమర్తిలో ఘనంగా శ్రీసీతారాములు..

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు ఫార్మాసిటీ పునరావాస కాలనీ లేమర్తి రామాలయం వద్ద సీతారాముల పరసను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు సీతారాముల వారిని దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం పరసలో ఏర్పాటు చేసిన కోలాటాలు, తప్పెటగుళ్లు, సాముగారిడీలు, బొమ్మల కొలువు, డాన్స్ బేబీ డ్యాన్స్ వంటి కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొత్తపాలెంలో పరదేశిమాంబ తీర్థం

గోపాలపట్నం: కొత్తపాలెంలో కొలువుదీరిన పరదేశిమాంబ తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వేకువజామున పూజలు చేశారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. భక్తజన సందోహంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. సాయంత్రం పరసలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకుంటున్న గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి, శంకర్ ఫౌండేషన్ ప్రతినిధులు

ప్రగతి పథంలో విశాఖ

... 3వ పేజీ తరువాయి

కొనసాగుతున్నాయన్నారు. జాతీయ ఉపాధిహామీ పథకం నుంచి రూ.16.55 కోట్లతో 11.64 కి.మీ సిమెంట్ రోడ్లు, రూ.2.9 కోట్లతో ఏడు కి.మీ. తారు రోడ్లు, రూ.3.22 కోట్లతో 173 గోకులాలకు షెడ్ల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయన్నారు. నగరానికి తాగునీరు, పరిశ్రమల అవసరాలకు కోసం గోదావరి నుంచి 23.44 టీఎంసీలు సరఫరాకు రూ.98.73 కోట్లతో పోలవరం ఎడమ ప్రధాన కాలువ ఎనిమిదో ప్యాకేజీకి పిలిచిన టెండర్లు ఖరారుదశలో ఉన్నాయన్నారు.

మహిళా సంఘాలకు చేయూత

జిల్లాలో 15,098 స్వయంశక్తి సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.866 కోట్ల రుణాలు, స్త్రీనిధి ద్వారా 5,286 సభ్యులకు రూ.26.44 కోట్ల రుణాలు అందజేశామన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా 18 వసతిగృహాల్లో మెరుగైన వసతుల కల్పనకు రూ.203 లక్షలు విడుదల చేశామన్నారు. బీసీ వెల్ఫేర్ ద్వారా 38,017 మంది బీసీ/ఈబీసీ/కాపు విద్యార్థులకు రూ.30 కోట్ల పోస్టు మెట్రిక్. 38,109 మంది విద్యార్థులకు రూ.35.72 కోట్లు మంజూరుచేశామన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం రూ.54.44 కోట్ల రుణాలను 2313 యూనిట్లకు అందజేశామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఐదు తాగునీటి పథకాలు, 80 చిన్న పథకాలు, పారిశుధ్యానికి రూ.40 కోట్లు మంజూరుచేశామన్నారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా రూ. 17.53 కోట్లతో 28 కి.మీ. 139 సీసీ రోడ్లు మంజూరు కాగా ఇంతవరకు 96 పనులు పూర్తి కాగా మిగిలినవి పురోగతిలో ఉన్నాయన్నారు. సెంటు స్థలంలో 1.39 లక్షల ఇళ్లకుగాను ఇంతవరకు 28,423 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. దీపం-2 పథకంలో పేదలకు ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల పంపిణీలో భాగంగా తొలివిడతగా 3,55,114 మందికి రూ.27.35 కోట్లు సబ్సిడీ బ్యాంకు ఖాతాలకు జమచేశామన్నారు.

సోలార్ విద్యుత్‌కు ఆదరణ

పీఎం సూర్యఘర్ బిజిలీ యోజన పథకం కింద ఇంటి పైకప్పులపై సోలార్ పలకల ఏర్పాటునకు జిల్లాలో ఐదు వేల మంది దరఖాస్తుచేయగా ఇప్పటివరకు 800 ఇళ్లకు పలకలు అమర్చి గ్రిడ్‌కు అనుసంధానంచేశామని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో రూ.16,219 కోట్లతో నాలుగు భారీ, రూ.43.4 కోట్లతో 35 సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రములు త్వరలో ఉత్పత్తులు ప్రారంభించనున్నాయని, దీంతో 35వేల మందికి ఉపాధి లభించనున్నదన్నారు. పర్యాటక శాఖకు పరిశ్రమల హోదా కల్పించడంతో జిల్లాకు భారీగా ప్రాజెక్టులు వచ్చే అవకాశం ఉందన్నారు. రుషికొండలో కొత్తగా ఐదు బోట్లు, ఫిషింగ్‌హార్బర్‌లో ప్రస్తుతం ఉన్న బోటింగ్‌యూనిట్‌కు 50సీట్ల సామర్థ్యం వరకు పెంచుతూ ప్రతిపాదనలు మంజూరుచేశామన్నారు. భూములకు సంబంధించి సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 7,098 అర్జీలు రాగా 60 శాతం పరిష్కరించామన్నారు. బీచ్‌రోడ్డులోవీఎంఆర్‌డీఏ చేపట్టిన హెలికాప్టర్ మ్యూజియం త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. కాకానినగర్ వద్ద వాహన రద్దీని పరిగణనలో తీసుకుని రూ.25 కోట్లతో అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదించామన్నారు.వీఎంఆర్‌డీఏ, సీఎస్ఆర్, పీపీపీ విధానంలో రూ.180 కోట్లతో 36 కి.మీ.పొడవైన రోడ్ల నిర్మాణాలకు అనుమతులు తీసుకున్నామని, కైలాసగిరిపై సాహసక్రీడలు, గ్లాస్‌స్కై వాకింగ్ బ్రిడ్జి త్వరలో అందుబాటులోకి తెస్తామన్నారు. కోస్టల్ బ్యాటరీ నుంచి భీమిలి వరకు తీరం కోత నివారణకు రూ.200 కోట్లతో ప్రతిపాదించామన్నారు.

ఏడాదికి రూ.3.33 కోట్లతో 25 అన్నక్యాంటీన్లను నిర్వహిస్తున్నామన్నారు. నగరంలో జనవరి ఒకటోతేదీ నుంచి ప్లాస్టిక్ నిషేధం అమల్లోకి వచ్చిందని, ప్రజలు సహకరించాలని కోరారు. సుమారు రూ.400 కోట్లతో రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలు, స్టేడియాలు మరమ్మతుల్లో కొన్ని పూర్తికాగా మరికొన్ని పురోగతిలో ఉన్నాయన్నారు. మధురవాడ, ముడసర్లోవలో రూ.595 కోట్లతో వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్, రూ.563 కోట్లతో మధురవాడలో డ్రైనేజీ నెట్‌వర్క్, పీపీపీ విధానంలో 15 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌కు ప్రతిపాదించామన్నారు. నగరంలో యూజీడీ వ్యవస్థ మెరుగుపర్చడానికి రూ.297 కోట్లతో చేపట్టిన రెండు ప్రాజెక్టులు ప్రారంభదశలోనే ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. తొమ్మిది ప్రభుత్వశాఖల శకటాల ప్రదర్శన, అనంతరం ఉత్తమ ప్రతిభ చూపిన 446 మంది ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. చివరగా వస్తువుల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, డీసీపీ మేరీ ప్రశాంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కుటుంబ వివరాలపై సమగ్ర సర్వే

... 3వ పేజీ తరువాయి

ఖాతాలున్నాయని గుర్తించి, ఇప్పటివరకు 3,98,403 (99.49 శాతం) బ్యాంకు ఖాతాలకు ఈకేవైసీ పూర్తిచేశారు.

ఎంఎస్‌ఎంఈలపై ఆరా!

ఉపాధి కోసం పలు రకాల పరిశ్రమలు స్థాపించిన కుటుంబాల స్థితిగతులపైనా సమగ్ర సర్వే చేస్తున్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) వివరాలు సేకరిస్తున్నారు. జిల్లాలో ఇటువంటి పరిశ్రమలు 1,14,482 ఉండగా ఇంతవరకు 25,980 (22.6శాతం) సర్వే చేశారు. ఆయా పరిశ్రమలపై ఆధారపడే కుటుంబాలు, ఉత్పత్తులు, స్థానికంగా విక్రయిస్తున్నారా లేక ఎగుమతి చేస్తున్నారా?, లభిస్తున్న ఆదాయం తదితర వివరాలు పొందుపరుస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంఎస్‌ఎంఈ యూనిట్‌లను ప్రోత్సహిస్తుండడం, సబ్సిడీలు, ఎగుమతులకు అనుకూలంగా విధానాలు రూపొందించడంతో ఎంఎస్‌ఎంఈ డేటా ఆ రంగాన్ని ప్రోత్సహించేందుకు వీలు కల్పిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

తప్పుల తడకగా నవశకం సర్వే

వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో నవశకం పేరిట హడావుడిగా సర్వే చేసింది. ఇందులో అనేక తప్పులు దొర్లాయి. కొంతమంది తప్పుడు ఆధార్,ఫోన్ నంబర్లు ఇచ్చారు. దీనిపై అప్పట్లోనే ఫిర్యాదులు వచ్చినా వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. ఆ వివరాల మేరకు ప్రస్తుతం సర్వే చేయగా ఆయా ఇళ్లలో నివసిస్తున్న వారికి, ఆధార్ నంబర్లకు పొంతన కుదరడం లేదు. దీనిని మిస్సింగ్ డేటాగా గుర్తించి, వారి వివరాల కోసం సర్వే చేస్తున్నారు. జిల్లాలో రెండు లక్షల మంది వివరాలు మిస్సింగ్‌డేటాలో ఉన్నట్టు గుర్తించిన సిబ్బంది ఇప్పటివరకు 72,873 మంది వివరాలు తెలుసుకున్నారు. మిగిలిన వారి వివరాలను సేకరించే పనిలో ఉన్నామని డీఎల్‌డీవో ఉషారాణి వివరించారు.

శోకిస్తున్న వైశాఖి

... 3వ పేజీ తరువాయి

చెల్లించాలి. అది కలిపితే సుమారుగా కోటి రూపాయలు అద్దెగా ఇవ్వాలి. అది కాకుండా అక్కడ జరిగే వ్యాపారంలో కొంత శాతం ఇవ్వాల్సి ఉంటుందని మరో నింబంధన ఉంది. అంటే ఎలా లేదన్నా నెలకు రూ.1.25 కోట్లు చెల్లించాలి. అది లాభదాయకం కాదని, అక్కడ అంత వ్యాపారం జరగదని వ్యాపారులు ఎవరూ ముందుకు రాలేదు. దాంతో వైశాఖి జల ఉద్యానవనం ప్రాజెక్టు ఏడాదిన్నరగా ఆగిపోయింది. దానిని ఎలా ముందుకు తీసుకెళ్లాలనే దానిపై అధికారులు కూడా ఏమీ ఆలోచించడం లేదు. ప్రస్తుతం అది ఖాళీగా ఉండడంతో ఆకతాయిల అడ్డాగా మారిపోయింది.

అధికారులతో చర్చిస్తాం

- ఎంవీ ప్రణవ్ గోపాల్, చైర్మన్, వీఎంఆర్‌డీఏ

ఇటీవల నిర్వహించిన ప్రజాదర్బార్‌లో దక్షిణ నియోజకవర్గ కూటమి నాయకులు కలిశారు. ఆ పరిధిలో అది ఒక్కటే వినోద కేంద్రమని, అభివృద్ధి చేయాలని కోరారు. అధికారులతో చర్చించి, ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలో ఆలోచిస్తాం.

నగరానికి మంత్రి నారా లోకేశ్

... 3వ పేజీ తరువాయి

అందజేసి ఆశీర్వదించాలని కోరగా ఆయన నవ్వుతూ తీసుకున్నారు.

ఎయిర్‌పోర్టు నుంచి నగరంలోని పార్టీ కార్యాలయానికి చేరుకున్న మంత్రికి భీమిలి, విశాఖ తూర్పు ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు మంత్రి లోకేశ్‌ను కలిశారు. గత ఏడాది మైదాన ప్రాంతం నుంచి ఎక్కువమందిని ఏజెన్సీకి బదిలీ చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ తమను తిరిగి మైదానానికి బదిలీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కాగా మంత్రి లోకేశ్ సోమవారం సాక్షిపై వేసిన పరువునష్టం కేసు విచారణలో జిల్లా కోర్టుకు హాజరు కానున్నారు.

వెంకటాద్రి ఆలయ మాజీ చైర్మన్ రాజు మృతి



ఎంఎస్ రాజు (ఫైల్)

పెందుర్తి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పెందుర్తిలో గల వెంకటాద్రి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ ఎంఎస్ రాజు (78) మృతి చెందారు. నగరంలోని ఆయన స్వగృహంలో గుండెపోటు రావడంతో మృతి చెందారు. వెంకటాద్రి ఆలయ నిర్మాణం, నిర్వహణ, అభివృద్ధికి రాజు ఎంతో కృషి చేశారు. పెందుర్తిలోని స్లీపర్ కంపెనీ ఎండీ రాజుగా స్థానికులకు సుపరిచితులైన ఆయన ఆధ్యాత్మికతతో పాటు శ్రీవారి భక్తుడు కావడంతో వెంకటాద్రి ఆలయంతో ప్రత్యేక అనుబంధం ఉంది.

గోపీజనవల్లభస్వామి ఆలయంలో నేటి నుంచి సుందరకాండ పారాయణం

వేపగుంట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 98వ వార్డు భరత్‌నగర్ సమీపంలోని గోపీజనవల్లభస్వామి ఆలయంలో సోమవారం నుంచి ఉదయం 9.30 గంటల నుంచి రెండు రోజుల పాటు సామూహిక సుందరకాండ పారాయణం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనవలసిందిగా వారు కోరారు.

'ప్రైవేటీకరణలతో భవిష్యత్తు తరాలకు అన్యాయం'

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఆర్థిక, సాంఘిక కుల అసమానతల రీత్యా మన దేశానికి ప్రైవేట్ రంగం పెట్టుబడులు పనికిరావని యూజ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.పరంధామయ్య అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత ప్రధాని నెహ్రూ సామ్యవాద ఆశయాలతో ప్రైవేట్‌రంగ సంస్థలను జాతీయకరణ చేశారన్నారు. ప్రైవేటీకరణల వల్ల భవిష్యత్తు తరాలకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బి.కామేశ్వరరావు, జి.జగ్గారావు, ఎస్.అమ్మన్న, ఎ.రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణతంత్ర సంబరం



59వ వార్డులో జాతీయ జెండా ఎగురవేసి గౌరవ వందనం చేస్తున్న ఎమ్మెల్యే గణబాబు, తదితరులు



పీఎస్ఈజడ్‌లో జెండా ఆవిష్కరించి సెల్యూట్ చేస్తున్న సంస్థ కమిషనర్ ముప్పాళ్ల శ్రీనివాస్, తదితరులు



మహా నగరంలో రెపరెపలాడిన మువ్వన్నెల పతాకం

పెందుర్తిలో జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు



ఆటోనగర్‌లో జెండా ఎగుర వేస్తున్న ఐలా కమిషనర్ కిషోర్

గాజువాక/ఉక్కుటౌన్‌షిప్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని ఆదివారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. జోనల్ కార్యాలయంలో జడ్సీ శేషాద్రి జెండా ఎగురవేయగా, పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్‌లో ఏసీపీ టి.త్రినాథ్, సీఐ పార్థసారథి, కర్నవానిపాలెంలో బీజేపీ 'గాజువాక' కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మువ్వన్నెల పతాకాలను ఆవిష్కరించారు. గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ జెండా ఎగురవేయగా, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ ఇంటక్ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, డీఏవీ స్కూల్‌లో ఉక్కు జీఎం గౌతమ్ మహీధర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుగంధ కుమారి, కేవీ స్కూల్‌లో ప్రిన్సిపాల్ ఈవీఎల్ఎన్ వంశీకృష్ణ, గాజువాకలో కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు, నడుపూరులో మంత్రి శంకర్ నారాయణ జెండా ఎగురవేశారు. స్టీల్‌ప్లాంట్ తృష్ణా మైదానంలో జెండా ఆవిష్కరించిన అనంతరం డైరెక్టర్ (ప్రాజెక్ట్సు) ఏకే బాగ్చి మాట్లాడుతూ కర్మాగారం అన్ని రంగాల్లో ముందుకు సాగడంతో పాటు అత్యాధునిక సాంకేతిక టెక్నాలజీని వినియోగించి ఉత్పత్తి సాధిస్తున్నామన్నారు. డైరెక్టర్లు ఎస్‌సీ పాండే, గణేశ్, ప్రసాద్, పాండే, సీఈవో ఎస్.కరణరాజు, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: ఇక్కడి ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి జెండా ఎగురవేశారు. సత్రం జంక్షన్‌లో మహాత్మాగాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షుడు చిత్రా రామారావు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అలాగే దువ్వాడలోని విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్ జెండా ఎగురవేశాక వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

అక్కిరెడ్డిపాలెం: భెల్ హెచ్‌పీవీపీ మైదానంలో సీనియర్ కార్మికుడు కరణం దేవుడు జెండా ఎగురవేయగా, సంస్థ ఈడీ జి.సుబ్రమణ్యం సెక్యూరిటీ సిబ్బంది, అగ్నిమాపక దళం, ఎన్‌సీసీ క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అలాగే 69 వార్డు పరిధిలోని తుంగ్లాం, నాతయ్యపాలెం, షీలానగర్ సచివాలయాల వద్ద కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, 68వ వార్డు పరిధి అక్కిరెడ్డిపాలెం పంచవటి కాలనీలో కార్పొరేటర్ గుడివాడ అనూష, స్థానిక హైస్కూల్‌లో హెచ్ఎం ఎంఎల్ఎస్ కాంతం జెండా ఎగురవేశారు.

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు గాంధీ పార్కులో టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా ఇంటక్ జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్, నాయకుడు మంత్రి శంకరనారాయణ, తదితరులు పాల్గొన్నారు. 65వ వార్డు పరిధి బాపూజీనగర్ ప్రాథమిక పాఠశాలలో కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు జెండా ఎగురవేశారు.

గోపాలపట్నం: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని జాతీయ జెండాను ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వరుగీస్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ స్వాతంత్ర్య సమరయోధుల కలలను సాకారం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు, సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెందుర్తి: ఇక్కడి తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాల్లో నిర్వహించిన గణతంత్ర సంబరాల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు అందజేశారు. తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్, ఎంపీడీవో కొల్లి వెంకటావు, ఎంపీపీ మధుపాడ నాగమణి, బీజేపీ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు. చినముషిడివాడలో గల వుడా కాలనీలో ఎక్స్‌సర్వీస్‌మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్పొరేటర్ సేనాపతి వసంత జెండా ఎగురవేశారు.

పెందుర్తి రూరల్: సుజాతనగర్‌లోని బీజేపీ కార్యాలయం వద్ద కార్పొరేటర్ ముమ్మన దేముడు జెండా ఎగురవేశారు. నాయకులు చిక్కాల సతీశ్, శ్రీకాంత్, గురునాథ్, లక్ష్మణకుమార్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: వేపగుంట జోనల్ కార్యాలయంలో జాతీయ జెండాను జడ్సీ హేమవతి ఆవిష్కరించగా ఏఎంహెచ్‌వో బండారు అప్పలనాయుడు, సూపరింటెండెంట్ పీవీఎస్ మూర్తి, శానిటరీ సూపర్‌వైజర్ రమణ, ఏపీడీ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు. ఆర్ఆర్‌వీపురం సమీపంలోని ఆళ్వార్ క్యాంపస్‌లో కో-ఆర్డినేటర్ జీవీఎస్ భగవాన్ ఆధ్వర్యంగా వేడుకలను నిర్వహించారు. 90వ వార్డు కాకానీనగర్ కేటీబీ కళాక్షేత్రంలో జర్నలిస్టు నేత గంట్ల శ్రీనుబాబు, జెండా ఎగురవేశారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: గోపాలపట్నం మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ సీహెచ్‌వీ రమేశ్ జెండా ఆవిష్కరించారు. కాకానీనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గణబాబు విచ్చేసి జెండా ఎగురవేశారు. సీతారామరాజునగర్‌లో కార్పొరేటర్ బొమ్మిడి రమణ, మర్రిపాలెం వుడా కాలనీ, నేతాజీనగర్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ జెండా ఎగురవేశారు.

మల్కాపురం: హెచ్‌పీసీఎల్‌లో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.రామకృష్ణ జెండా వేశారు. సీఐఎస్ఎఫ్ జవాన్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పలువురు ఉద్యోగులను అభినందిస్తూ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు అభిషేక్ త్రివేది, జి.కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. షిప్‌యార్డు రిక్రియేషన్ క్లబ్ మైదానంలో జాతీయ జెండాను సంస్థ అధికారి ఎగురవేయగా, షిప్‌యార్డు పాఠశాల విద్యార్థులు, పలువురు ఉద్యోగులు గౌరవ వందనం చేశారు. కోరమాండల్ ఎరువుల కర్మాగారంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎం.జ్ఞానసుందరం జెండా ఆవిష్కరించగా, డీజీఎం (హెచ్ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు, సెక్యూరిటీ విభాగం ముఖ్య అధికారి పి.నారాయణపాత్రుడు, సీనియర్ మేనేజర్ (హెచ్ఆర్) శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ములగాడ మండల కార్యాలయంలో తహసీల్దార్ భుజంగరావు, మల్కాపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శ్రీనివాసరావు, ఆయా వార్డుల్లో కార్పొరేటర్లు గులిగిందల లావణ్య, పుర్రె పూర్ణశ్రీ, పీవీ సురేశ్, కొణతాల సుధ, బల్ల లక్ష్మణరావు, గల్లా పొలిపిల్లి (చిన్న), నగరాల వీధిలో ఇంటక్ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం జెండా ఎగురవేశారు. 59వ వార్డు ఎక్స్ సర్వీస్‌మెన్ కాలనీలో యూత్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవంలో ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంగ దుర్గాప్రశాంతి, తదితరులు పాల్గొన్నారు.

సింధియా: గ్రేటర్ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో రాంజీ భీమ్ రావ్ ఎస్సీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు పాల్గొని జెండా ఎగురవేశారు. అలాగే 62వ వార్డు పరిధి దుర్గానగర్‌లో టీడీపీ వార్డు అధ్యక్షుడు జెండా ఆవిష్కరించారు.

ఆటోనగర్: ఏపీఐఐసీ, ఐలా కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర సంబరాల్లో భాగంగా ఐలా కమిషనర్ ఎ.కిశోర్, చైర్మన్ కె.సత్యనారాయణరెడ్డి (రఘు) జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. స్వాతంత్ర్య సమరయోధుల ఆశయాలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని వారు కోరారు. ఐలా ప్రతినిధులు కొల్లి ఈశ్వరరావు, చీకటి సత్యనారాయణ, పి.పద్మావతి, రామకృష్ణరాజు, సజ్జ పాండురంగప్రసాద్, యార్లగడ్డ సాంబశివరావు, ఎన్.శేషగిరిరావు, బాపిరాజు, కృష్ణ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. సూక్ష్మ, చిన్న, పరిశ్రమల కార్యాలయం (వాసీవా)లో అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ జెండా ఆవిష్కరించారు. అలాగే వీఎస్ఈజడ్‌లో కమిషనర్ ముప్పాళ్ల శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. అధికారులు రోషి అపరంజి కొరటి, ఆర్‌పి ప్రవీణ్‌కుమార్, ప్రసన్నకుమార్, వరప్రసాద్ వర్మ, ఏవీ శివప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి కణితి హైస్కూల్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ జెండా ఎగురవేయగా హెచ్ఎం సూర్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు. సిద్ధార్థనగర్ కాలనీలో దువ్వాడ సీఐ కె.మల్లేశ్వరరావు, స్టీల్ సిటీ ఆర్టీసీ డిపోలో డీఎం గౌతమ్ ఛటర్జీ జెండా ఎగురవేశారు. కణితి ఆస్పత్రి ఆవరణలో జరిగిన పతాకావిష్కరణ కార్యక్రమంలో వైద్యులు శివయ్య, బాబీ, గోపి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలను పాటించాలి

గాజువాక, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రహదారి నిబంధనలను పాటిస్తే ప్రమాదాలు దూరమవుతాయని విశ్వ మానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు మస్తాన్‌రావు అన్నారు. గాజువాకలో ట్రాఫిక్ నిబంధనలపై ఆదివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే ప్రమాదాలు జరుగుతాయని, అందరూ అప్రమత్తంగా వాహనాలు నడపాలన్నారు. కార్యక్రమంలో గాజువాక శాఖ కన్వీనర్ బి.అప్పారావు, ప్రతినిధులు స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం:** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-12 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్:** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 35, టమాటా 14, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 46, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 44, బీరకాయలు 52, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 15, క్యారెట్ 36, దొండకాయలు 36, బంగాళదుంపలు 26, అరటికాయ (పెద్దది)7, అల్లం (పాతది) 48, మునక్కాడలు (కిలో) 110, బరబాటి 36, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 24, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 42, పొటల్స్ 80, కీరదోస 34, క్యాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 50, చిలగడదుంపలు 40, కంద 56, దేముడుచిక్కుడు 40, గోరుచిక్కుడు 30, ఆగాకార దేశవాళి 100, ఆగాకర హైబ్రిడ్ 50, కూరపెండలం 26, బ్రకోలి 80, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, మామిడి అల్లం 64, బొప్పాయి 35, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	120
లైవ్ ధర	140
విత్ స్కిన్	250
స్కిన్‌లెస్	260

గణతంత్ర వేడుకల్లో ఎస్ఆర్‌పురం సర్పంచ్



దూది విజయలక్ష్మికి మెమెంటో అందజేస్తున్న కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్

పెందుర్తి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధానిలో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకలకు మండలంలోని ఎస్ఆర్‌పురం సర్పంచ్ దూది విజయలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇండియన్ గేట్ వే పరేడ్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు అంశాలను పంచాయతీలో అమలుచేసి, అభివృద్ధి సాధించినందుకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ చేతుల మీదుగా సర్పంచ్ విజయలక్ష్మి మెమెంటో అందుకున్నారు. గణతంత్ర వేడుకలకు రాష్ట్ర వ్యాప్తంగా 25 మంది సర్పంచులు ఎంపికవగా విశాఖ జిల్లా నుంచి ఎస్ఆర్‌పురం సర్పంచ్ విజయలక్ష్మికి స్థానం లభించింది.

బస్సు ప్రమాదంలో గాయపడిన యువతి మృతి



మృతురాలు దీక్షిత (ఫైల్)

పెందుర్తి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం దివాన్ చెరువు హైవే శివారులో ఇటీవల ట్రావెల్ బస్సు బోల్తా పడిన ఘటనలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నగరంలోని సుజాతనగర్‌కు చెందిన ఈల్లా దీక్షిత (21) ఆదివారం మృతి చెందింది. బీటెక్ చేసిన దీక్షిత హైదారాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం నిమిత్తం ఇంటర్వ్యూకు తమ బంధువైన మర్రిపాలేనికి చెందిన కల్యాణితో కలిసి బస్సులో వెళుతూ ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో కల్యాణి అక్కడికక్కడే మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆదివారం దీక్షిత నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

చికిత్స పొందుతూ మరో బాలిక మృతి



మృతి చెందిన మహంతి ఇషిత (ఫైల్ ఫొటో)

తగరపువలస, జనవరి 26 (ఆంధ్రజ్యోతి) : దంపతుల మధ్య తలెత్తిన మనస్పర్థల కారణంగా క్షణికావేశంలో ఇద్దరు బిడ్డలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సం ఘటనలో మరో బాలిక కూడా మృతి చెందింది. భీమిలి మండలం చిట్టివలసలోని ఆదర్శనగర్ కాలనీ గొల్లవీధిలో నివాసం ఉంటున్న మహంతి మాధవి (25) శుక్రవారం సాయం త్రం తన ఇద్దరు కుమార్తెలు ఇషిత (5), రితిక్ష (18 నెలలు)తో కలిసి పురుగుల మందు తాగిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో శుక్రవారం అర్ధరాత్రి ఆస్పత్రిలో చికిత్స పొం దుతూ మాధవి మృతి చెందగా, శనివారం తెల్లవారుజామున చిన్న కుమార్తె రితిక్ష ప్రాణాలు విడిచింది. పెద్ద కుమార్తె ఇషిత నగరంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొం దుతూ ఆదివారం తెల్లవారుజామున కన్ను మూసింది. మాధవి భర్త రామకృష్ణ ఫోన్‌కు వేరే యువతి నంబరు నుంచి వస్తున్న మెసేజ్‌ల కారణంగా ఇద్దరి మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం భర్త దివీస్ కంపెనీలో విధులకు వెళ్లిపోగా మాధవి, తన ఇద్దరు పిల్లలకు ఆహారంలో పురుగుల మందు కలిపి పెట్టింది. తాను తినింది. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం వల్ల ఆమెతో పాటు ఇద్దరు పిల్లలు మృతి చెందారు. ఈ ఘటనతో గొల్లవీధిలో విషాదం నెలకొంది. ఎంతో సరదాగా వుండే కుటుంబంలో ఘోరం జరిగిపోయిందంటూ స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. భార్య పిల్లలను కోల్పోయిన భర్త దిగాలు పడిపోయారు. ఈ విషయమై భీమిలి సీఐ సుధాకర్ మాట్లాడుతూ ఇషిత మృతదేహానికి భీమిలి ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యువకుడిని గాయపరిచిన రౌడీషీటర్

వేపగుంట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట రవినగర్‌లో మద్యం మత్తులో ఓ యువకుడిని గాయపరిచిన రౌడీషీటర్‌ను పెందుర్తి పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాయుడుతోట రవినగర్‌లో పలు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్న బి. ప్రేమ స్వరూప్ (29) అలియాస్ బాబీ రవినగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇటీవల హైదరాబాద్ నుంచి కోర్టు కేసు నిమిత్తం నగరానికి వచ్చాడు. రవినగర్‌లోనే నివాసం ఉంటున్న స్నేహితుడు ఎం.చరణ్‌కుమార్ (22)తో కలిసి శనివారం రాత్రి మద్యం సేవించాడు. మద్యం మత్తులో వీరిద్దరూ వాగ్వాదానికి దిగారు. నీ వల్లే తనపై రౌడీషీట్ తెరిచారంటూ ప్రేమ స్వరూప్ మద్యం బాటిల్‌తో చరణ్‌కుమార్‌పై దాడి చేయడమే కాకుండా బ్లేడుతో గొంతుపై, కుడిచేతిపై తీవ్రంగా గాయపరిచి అక్కడ నుంచి పారిపోయాడు. గాయపడిన చరణ్‌ను పోలీసులు ఆస్పత్రికి తరలించారు. పెందుర్తి సీఐ సతీశ్‌కుమార్ హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఆదివారం ప్రేమ స్వరూప్‌ను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన ఉక్కు ఉద్యోగిని కాపాడిన పోలీసులు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల కారణంగా చనిపోతానని మెసెజ్ చేసి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయిన తమ కుమారుడు, ఉక్కు ఉద్యోగి కె.మల్లేశ్వరరావును కాపాడాలంటూ ఆయన తండ్రి ఆదివారం ఉదయం స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన సీఐ ఈ.కేశవరావు తమ సిబ్బందిని అప్రమత్తం చేసి వెతికారు. ఫిర్యాదు అందిన అరగంట వ్యవధిలోనే స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ పరిధిలో మల్లేశ్వరరావును పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

వేపగుంట, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం సమీపంలోని కంఫర్ట్ హోమ్స్‌లో శనివారం రాత్రి వేంకటేశ్వరస్వామి, పద్మావతిదేవిల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పెందుర్తి వెంకటాద్రి క్షేత్రం అర్చకులు రామానుజాచార్యుల పర్యవేక్షణలో ఆగమశాస్త్ర శ్రీవారి కల్యాణాన్ని జరిపారు. కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జా పాల్గొని పూజలు చేశారు. స్వామివారి కళ్యాణంలో 25 జంటలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ రూట్ మార్చ్

పెదగంట్యాడ, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ పెదగంట్యాడ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం వికాస్‌నగర్‌లో రూట్‌మార్చ్ నిర్వహించారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర రూట్‌మార్చ్ చేపట్టారు. కార్యక్రమానికి ఆరోగ్య భారతి పరిశీలకులు వీవీఎల్ శ్రీనివాసరావు, పూజారి రమణయ్య సారథ్యం వహించారు. ఆర్ఎస్ఎస్, బీఎంఎస్, బీజేపీ ప్రతినిధులు ఎలమంచిలి అప్పలనాయుడు, వినోద్ కుమార్, సూర్యప్రకాశ్, గొందేశి గురప్పరెడ్డి, గొలగాని చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

'పాత పద్ధతిలోనే మెడికల్ ఇన్సూరెన్స్ కొనసాగించాలి'

అగనంపూడి, జనవరి 26 (ఆంధ్రజ్యోతి): ఉక్కు విశ్రాంతి ఉద్యోగులకు పాత పద్ధతిలోనే మెడికల్ ఇన్సూరెన్స్‌ను కొనసాగించాలని స్థానిక విశ్రాంతి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విశ్రాంతి ఉద్యోగులకు ఆర్థిక భారం కలిగించే నూతన ప్రతిపాదనలను స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. ఇప్పటికే విశ్రాంతి ఉద్యోగులకు తక్కువ ఈపీఎస్ పించన్ వస్తుందన్నారు. కొత్త ప్రతిపాదనతో మరింత ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం ప్రతినిధులు సుశీల గజేంద్రరరావు, బి.సత్యనారాయణ, ఈశ్వరరావు, సన్యాసిరావు, ఎర్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.